RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ


TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 233 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం, మార్చి,12, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 233 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thursday, March,12, 2026 | PAGES : 8 RS : 4 /- |


## తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం



- ప్రమాణం చేయించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్
- కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఉన్నతాధికారులు
- ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం



**హైదరాబాద్,మార్చి,11,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ ఆయనతో ప్రమాణం చేయించారు. అయితే, ఉత్తరప్రదేశ్‌కు చెందిన శుక్లా అనూహ్యం గా తెలుగులో ప్రమాణం చేసి అక్కడున్న వారందరినీ ఆశ్చర్యపరిచారు. ఈయన తెలంగాణకు నాల్గవ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. వీరితో పాటు హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ బి.శివధర్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ శుక్లాకు ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఈ నెల 16వ తేదీ నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అదే రోజున ఉభయ సభలను ఉద్దేశించి కొత్త గవర్నర్ ప్రసంగించనున్నారు. గతవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న శుక్లా ను తెలంగాణకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు తెలంగాణ గవర్నర్‌గా ఉన్న జిష్ణు దేవ్ వర్మను మహారాష్ట్రకు గవర్నర్‌గా నియమించారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన శివ్ ప్రతాప్ శుక్లా, విద్యార్థి దశ నుంచే ఏబీవీపీలో చురుకుగా పనిచే శారు...

## ఇరాన్,అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధాన్ని రాజకీయం చేస్తోన్న కాంగ్రెస్

- గల్ఫ్‌లోని పరిస్థితుల కారణంగా మన ఆందోళన సహజమే
- లక్షలాది మంది భారతీయులు అక్కడ పని చేస్తున్నారు : మోదీ
- గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులను ఒంటరిగా వదలం: నరేంద్ర మోదీ



**న్యూఢిల్లీ,మార్చి,11:** ప్రస్తుత సంక్షోభ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని ఇండియాకు తీసుకొస్తామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మోదీ విమర్శించారు. బుధవారం కేరళంలోని కోచిలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయే కూటమి నిర్వహించిన ఒక కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. త్వరలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ అక్కడి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేశారు. "విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వదిలిపెట్టబోం. వారిని ఇండియాకు తీసుకొస్తాం. పశ్చిమాసియా సంక్షోభంలో మిగిలిపోయిన భారతీయులకు తగిన సాయం అందిస్తున్నాం. వాళ్ల క్షేమం, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. గల్ఫ్ కంట్రీస్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అక్కడి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు. మనవారి సేవలు గుర్తించి, తగిన సహాయం అందిస్తున్నాయి అక్కడి ప్రభుత్వాలు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై రాజకీయం చేస్తోంది. రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారతీయుల విషయంలో రాజకీయం చేయడం తగదు.

## ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం... అయోధ్యలో అన్నదాన కేంద్రంపై ప్రభావం




పశ్చిమాసియా దేశాల్లోని ఉద్రిక్తతల కారణంగా మన దేశంలో వంటగ్యాస్ కొరత తీవ్రమవుతోన్న విషయం తెలిసిందే. ఈ ప్రభావం అయోధ్యను కూడా తాకింది. ఎల్పీజీ సిలిండర్ల కొరత కారణంగా అయోధ్య, రాంనగరి అమవా ఆలయంలోని రామ్ రసోయి అన్నదాన కేంద్రంను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఈ మేరకు అన్నదాన కేంద్రం వద్ద నోటీసులు అంటిం చారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేనందున కమ్యూనిటీ కిచెన్ అందుబాటులో లేదని అక్కడకు వచ్చిన భక్తులు చెబుతున్నారు. దైవ దర్శనం కోసం వచ్చానని, ఆ తర్వాత రామ్ రసోయిలో అన్నదానం చేస్తారని తెలిసి వచ్చానని కానీ వంట గ్యాస్ కొరత కారణంగా భోజనం తయారు చేయడం లేదని ఒక భక్తుడు తెలిపాడు. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఈ సమస్య తలెత్తిందని ఆలయ అధికారులు తెలిపారు.
నిన్న మధ్యాహ్నం రెండు గంటల నుంచి వంట గ్యాస్ సమస్య ఉందని తెలిసిందని అన్నారు. అయితే ఈరోజు రామ్ రసోయి యథావిధిగా పని చేస్తుందని చెప్పడం గమనార్హం. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా బెంగళూరు, ముంబై, ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడుతున్న విషయం తెలిసిందే. ఎల్పీజీ కొరత వల్ల ఢిల్లీ హైకోర్టులోని క్యాంటీన్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## రైతులకు ప్రయోజనకరంగా కొత్త డిస్కం..

### తెలంగాణలో మరో డిస్కం ఏర్పాటు..



**హైదరాబాద్,మార్చి,11,తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేం దుకు రాష్ట్రంలో మూడో డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పనిచే స్తున్న టీజీఎస్పీడీసీఎల్ టీజీఎన్‌పీడీసీఎల్ సంస్థలకు అదనంగా కొత్త డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ కొత్త సంస్థకు అనే పేరు పెట్టారు. దీనిని సాధారణంగా 'రైతు డిస్క మ్'గా కూడా పిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభు త్వ ఉత్తర్వుల ప్రకారం.. ఈ సంస్థనుకం పెనీస్ యాక్ట్--2013 ప్రకారం నమోదు చేయనున్నారు. హైదరాబాద్‌లోని మింట్‌కం పౌండ్ ప్రాంతంలో ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో పెరుగుతున్న అవసరాలనుదృష్టిలో పెట్టుకుని ఈకొత్త సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

**జీవో జారీ చేసిన ప్రభుత్వం.. ఈ కొత్త సంస్థకు సీఎండీగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియామకం..**

## ఫిరాయింపులపై స్పీకర్ నిర్ణయం దారుణం

### లోక్‌సభలో లేవనెత్తుతాం: సురేశ్ రెడ్డి

**న్యూఢిల్లీ,మార్చి11:** తెలంగాణలో పార్టీ ఫిరాయింపులపై పార్లమెంట్‌లో లేవనెత్తుతామని ఎంపీ కేఆర్ సురేష్ రెడ్డి వెల్లడించారు. పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని అపహాస్యం చేసినట్టేనని పేర్కొన్నారు. రాజ్యాంగంలో మార్పులు కావాలని కాంగ్రెస్ కేంద్ర నాయకులు, రాహుల్ గాంధీ మాట్లాడుతున్నా, తెలంగాణలో దీనికి పూర్తి వ్యతిరేకంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఒక పార్టీ నుంచి గెలిచి, మళ్లీ ఇంకో పార్టీ నుంచి పోటీ చేసిన విషయం స్పష్టంగా రుజువులున్నా కూడా స్పీకర్ ఇచ్చిన తీర్పు నవ్వుల పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తీర్పులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సూచించారు.

## బీఆర్ఎస్‌లోనే ఉన్నాం కానీ నాయకత్వానికి దూరంగా ఉన్నాం

- స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడిన కడియం శ్రీహరి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్ చట్టబద్ధం కాదన్న శ్రీహరి



**హైదరాబాద్,మార్చి,11,తెలంగాణ దిశ :** తాము బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని, కానీ ఆ పార్టీ నాయకత్వానికి దూరంగా ఉన్నామని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ తనకు క్లీన్ చిట్ ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ తీర్పును స్వాగతిస్తున్నానని అన్నారు. తమకు వ్యతిరేకం గా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్ చట్టబద్ధం కాదని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ తనకు ఇప్పటి వరకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని వెల్లడించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఎప్పుడూ ప్రజల ముందుకు వచ్చి పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడలేదని తెలిపారు. శాసన సభలో మేం ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించలేదని అన్నారు.

## స్పీకర్ ఓం బిర్లాపై లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చ



### ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశమే ఇవ్వలేదన్న రాహుల్ గాంధీ - విమర్శలను తిప్పికొట్టిన కేంద్రం

**న్యూఢిల్లీ,మార్చి,11:** పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత మాట్లాడకుండా స్పీకర్ ఓం బిర్లా అనేక సార్లు అడ్డుకున్నారని కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. ఈ చర్చ ప్రజాస్వామ్యం అన్నారు. పదే పదే స్పీకర్ ఓం బిర్లా తనను మాట్లాడకుండా అడ్డుకున్నారని.. లోక్‌సభ అనేది దేశానికి ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి అనుమతించలేదని రాహుల్ గాంధీ అనగానే... బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ కలుగజేసుకుని.. ఎప్పుడూ...ఎప్పుడూ... ఎప్పుడూ అని అడిగారు. ప్రధాని మోడీ స్పీకర్ కుర్చీని విపక్ష సభ్యులు చాలాసార్లు చుట్టుముట్టారని, కాగితాలు విసిరారని రవిశంకర్ ప్రసాద్ అన్నారు. కానీ స్పీకర్ ఎప్పుడూ నవ్వుతూనే ఉన్నారని పేర్కొన్నారు. స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలనే తీర్మానంపై లోక్‌సభలో చర్చ సాగుతోంది. రవిశంకర్ ప్రసాద్ బుధవారం చర్చను ప్రారంభించారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల్లో స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం చర్చకు రావడం ఇది రెండోసారి మాత్రమే అని అన్నారు. "స్పీకర్ వైఖరి, అవిశ్వాసాన్ని సాధనంగా ఉపయోగించకూడదు. డాక్టర్ అంబేద్కర్‌ను ఉటంకిస్తూ స్పీకర్‌కు గౌరవం ఉందని.. సభకు జవాబుదారీగా ఉంటారు. ఈ సభ అనేక ఒడిదుడుకులను చూసింది. ప్రతిసారీ పార్లమెంటు కొత్త ఎత్తులకు చేరుకుంది. ఈ సభలోనే 11 మంది ఎంపీలు బహిష్కరించబడ్డారు.

## హోర్ముజ్‌లో భారత్ వస్తున్న కార్గో షిప్‌పై అటాక్..

**న్యూఢిల్లీ,మార్చి,11:** యూఏఈ నుంచి భారత్ వస్తున్న థాయ్ జెండా కలిగిన కార్గో షిప్ పై బుధవారం దాడి జరిగింది. యూఏఈ పోర్టు నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే "హోర్ముజ్ జలసంధి"లో ఈ దాడి జరిగినట్లు థాయ్ నేవీ తెలిపింది. నౌకలోని ఇరవై మంది నావికుల్ని రక్షించారు. ముగ్గురి ఆచూకీ ఇంకా తెలియలేదు. మయూరీ నరీ అనే నౌక భారతదేశంలోని కాండ్లా ఓడరేవుకు వెళుతుండగా దాడి జరిగింది. థాయ్ కంపెనీ ప్రెషియస్ షిప్పింగ్ పిసిఎల్ యాజమాన్యంలోని బల్క్ క్యారియర్ మయూరీ నరీ అనే నౌక యుఎఇలోని ఖలీఫా పోర్టు నుండి బయలుదేరి భారతదేశంలోని ఇరాన్ గల్ఫ్ లోని కువైట్, బహ్రెయిన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈలోని కీలక ప్రాంతాలపై దాడులు చేస్తోంది.

## హాస్టళ్లపై గ్యాస్ సరఫరా ఎఫెక్ట్ తగ్గిన ఫుడ్ ఐటమ్స్ సరఫరా

**హైదరాబాద్,మార్చి11,తెలంగాణ దిశ :** మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ ప్రభావం హైదరాబాద్‌లోని హాస్టల్స్‌పై పడింది. ఇరాన్– ఇజ్రాయెల్ ఉద్రిక్తతల మధ్య గ్యాస్ సంక్షోభం వాటిల్లిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుత హాస్టల్స్‌కు గ్యాస్ సరఫరా తగ్గింది. ఐటీ కారిడార్‌లో గ్యాస్ సరఫరా తగ్గడంతో ఫుడ్ ఐటమ్స్ తగ్గించారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలవడంతో హాస్టల్ యాజమాన్యాలు ఆందోళనలో ఉన్నాయి.. ఈ అంశంపై హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు స్పందించారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిందని.. కావల్సినంత గ్యాస్ సరఫరా లేదన్నారు..
ప్రస్తుతం నగరంలో పదకొండు వేల హాస్టల్స్ ఉన్నాయని.. లక్షల మంది హాస్టల్స్‌లో ఉన్నారన్నారు.. ఎడ్యుకేషన్.. హాస్పిటల్‌కు సంబంధించిన హాస్టల్స్‌కు గ్యాస్ సరఫరా చేస్తున్నారని చెప్పారు.. 'కమర్షియల్ గ్యాస్ ఇవ్వకుంటే.. డొమెస్టిక్ గ్యాస్ రోజుకి ఒకటైన ఇవ్వాలని కోరారు.. అధికారులతో మాట్లాడాం.. రెస్పాన్స్ లేదు.. గ్యాస్ ఎక్కువగా కన్సంప్షన్ అయ్యే ఫుడ్ ఐటమ్స్ తగ్గిస్తున్నాం.. చపాతి దోశ వంటి ఐటమ్స్ తగ్గిస్తామని చెప్పాం.. హాస్టల్స్ మూసేసే పరిస్థితి రాదని అనుకుంటున్నాం..' అని హాస్టల్ యాజమాన్యాలు వెల్లడించాయి.



# వికలాంగుల పెన్షన్‌ను రూ.6,000లకు పెంచాలి : కురునెల్లి వెంకట్

## – మార్చి 13న హైదరాబాద్‌లో సామూహిక నిరాహార దీక్ష

**హైదరాబాద్, మార్చి 11, (తెలంగాణ దిశ)** :వికలాంగుల పెన్షన్‌ను నెలకు రూ.6,000లకు పెంచాలని, ఎంపికైన లబ్ధిదారులకు సహాయ పరికరాలను వెంటనే పంపిణీ చేయాలని, అలాగే రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి నిధుల కేటాయింపులు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కురునెల్లి వెంకట్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం మార్చి 13న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద వికలాంగులతో కలిసి సామూహిక నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 27 నెలలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగుల పెన్షన్‌ను రూ.4,016 నుంచి రూ.6,000లకు పెంచుతామని, చేయూత పథకం కింద పెన్షన్‌ను రూ.2,016 నుంచి రూ.4,000లకు పెంచి 2023 డిసెంబర్ నుంచే అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఇప్పటి వరకు ఆ హామీలను అమలు చేయకపోవడం లబ్ధిదారులను మోసం చేయడమేనని విమర్శించారు. 2023 అక్టోబర్ నాటికి రాష్ట్రంలో 44,49,767 మందికి పెన్షన్లు అందుతుండగా, 2026 జనవరి నాటికి అది 42,80,129 మందికి తగ్గిందని తెలిపారు. అంటే 27 నెలల్లో 1,69,638 మంది పెన్షన్లు రద్దు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అదే విధంగా వికలాంగుల పెన్షన్లు 2023 అక్టోబర్ నాటికి 5,14,422 మందికి ఉండగా, 2026 జనవరి నాటికి 4,84,850 మందికి తగ్గాయని, 29,572 మంది వికలాంగుల పెన్షన్లు రద్దు చేయడం జరిగిందని అన్నారు. పెన్షన్ పెంపు చేయకుండా పెన్షన్లు రద్దు చేయడం ప్రభుత్వానికి ఏ హక్కుతో జరుగుతుందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. చేయూత పెన్షన్ల కోసం ప్రతి నెల రూ.994.50 కోట్లు అవసరమని తెలిపారు. 2024--25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.14,628.91 కోట్లు కేటాయించినప్పటికీ, అందులో రూ.10,514.32 కోట్లు మాత్రమే విడుదల చేసిందని చెప్పారు. కేటాయించిన నిధులను కూడా పూర్తిగా విడుదల చేయకపోవడం ప్రభుత్వం లబ్ధిదారుల పట్ల చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రాబోయే 2026--27 వార్షిక బడ్జెట్‌లో పెన్షన్ల పెంపుకు అవసరమైన నిధులు కేటాయించాలని, వికలాంగుల సంక్షేమానికి కనీసం 5 శాతం నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేయూత పెన్షన్ కోసం 24.85 లక్షల మంది దరఖాస్తు చేసుకుని 26 నెలలుగా ఎదురు చూస్తున్నప్పటికీ, ఇప్పటివరకు మంజూరు చేయకపోవడం బాధాకరమని అన్నారు. పెన్షన్లు పెంచేందుకు డబ్బులు లేవని చెప్పే ప్రభుత్వం, ఇతర కార్యక్రమాలకు భారీ మొత్తాలు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉందని విమర్శించారు. సహాయ పరికరాల కోసం 2024--25 ఆర్థిక సంవత్సరంలో 15 వేల మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఎంపికైన లబ్ధిదారులకు ఇప్పటి వరకు పరికరాలు పంపిణీ చేయలేదని తెలిపారు. పరికరాల కోసం రూ.50 కోట్లు విడుదల చేశామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాటిని పంపిణీ చేయకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని విమర్శించిన ఆయన, మార్చి 16 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లో పెన్షన్ల పెంపుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం మార్చి 13న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద వికలాంగులతో కలిసి సామూహిక నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.



# బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులుగా 27 మందికి బాధ్యతలు



**హైదరాబాద్, మార్చి 11, (తెలంగాణ దిశ)** :భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ శ్రీ ఎన్. రామ్‌చందర్ రావు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులుగా 27 మందిని నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతమ్ రావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ విధానాలు, కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో భాగంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నాయకులను రాష్ట్ర అధికార ప్రతినిధులుగా నియమించినట్లు తెలిపారు. నియమితులైన వారిలో సంగారెడ్డి జిల్లా నుంచి జే. సంగప్ప, వరంగల్ జిల్లా నుంచి జి. రాణి రుద్రమ, రంగారెడ్డి రూరల్ జిల్లా నుంచి పొరెడ్డి కిషోర్ రెడ్డి, నాగర్ కర్నూల్ నుంచి ఎన్. దిలీపాచారి, రంగారెడ్డి అర్బన్ నుంచి చి. విఠల్, జి. విజయ సునిత రెడ్డి, నాగర్ కర్నూల్ నుంచి డాక్టర్ సోలంకి శ్రీనివాస్, మేడ్చల్ అర్బన్ నుంచి తాడూరి శ్రీనివాస్ ప్రజాపతి, సుధాకర్ గండే, డాక్టర్ రాహుల్ సరిదేనా, రాజన్న సిరిసిల్ల నుంచి డా. చెన్నమనేని వికాస్ రావు, హైదరాబాద్ సెంట్రల్ నుంచి బి. ఇంద్రసేనా రెడ్డి, సందీప్ సాయి, డాక్టర్ సమతా జి, సిద్దిపేట నుంచి కప్పర ప్రసాద్ రావు, జనగామ నుంచి డా. అరుట్ల దశ్మంత్ రెడ్డి, భాగ్యనగర్ మలక్‌పేట్ నుంచి చికోటి ప్రవీణ్, మహంకాళి సికింద్రాబాద్ నుంచి ఎన్. నాగేంద్ర బాబు, పిఎల్. శ్రీనివాస్, అభిషేక్ జె., రంగారెడ్డి అర్బన్ నుంచి ఎం. రవి కుమార్ యాదవ్, కరీంనగర్ నుంచి యాదగిరి సునీల్ రావు, వరంగల్ నుంచి డాక్టర్ వన్నాల వెంకటరమణ, ఖమ్మం నుంచి డాక్టర్ వి. పుల్లారావు యాదవ్, నంబూరి రామలింగేశ్వరరావు, సంగారెడ్డి నుంచి రవి కుమార్ గౌడ్, ఆదిలాబాద్ నుంచి అశోక్ ముస్తాపూర్ ఉన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు పార్టీ విధానాలను ప్రజలకు సమర్థంగా వివరించాలని పార్టీ నాయకత్వం కొత్తగా నియమితులైన అధికార ప్రతినిధులకు సూచించింది.

# భూగర్భ జలాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## - అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 11, (తెలంగాణ దిశ)**:భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి నివారణకు భూగర్భ జల వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. కేంద్రీయ భూగర్భ జల బోర్డు, జలశక్తి మంత్రిత్వ శాఖ, జలవనరులు, నదీ జలాల అభివృద్ధి గంగా పునరుజ్జీవ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో భూగర్భ జలాల సంరక్షణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖల ఇంజనీర్లు, క్షేత్ర, సాంకేతిక సహాయకులకు ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూగర్భ జలాల సంరక్షణకు సంబంధించి శాస్త్రవేత్తలు పలు పరిశోధనలు చేస్తారని, ఆ పరిశోధనల ఫలితాలు క్షేత్రస్థాయిలో అమలు కావడానికి ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్యమని అన్నారు. ఈ దిశగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పెద్ద ఎత్తున సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి నదీ జలాలను వినియోగించుకున్నట్లే, ప్రస్తుతం అంతరించిపోతున్న భూగర్భ జలాలను కాపాడుకోవడానికి ఇంకుడు గుంతలు, నీటి కుంటలు వంటి నిర్మాణాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు, ఇలాంటి శిక్షణల్లో తెలుసుకున్న అంశాలను సద్వినియోగం చేసుకొని జిల్లాలో భూగర్భ జలాలను పెంచేందుకు అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా సీజీడబ్ల్యూబీ శాస్త్రవేత్త డాక్టర్ పండిట్ మధునూర్ మాట్లాడుతూ భూగర్భ జలాలను సాంకేతిక పరంగా ఎలా సంరక్షించుకోవాలి, వాటికి ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలనే విషయాలను తెలియజేయడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయడం ద్వారా భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించవచ్చని తెలిపారు. సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సుధీర్ బాబు భూగర్భ జలాల ప్రాముఖ్యత, వాటి పరిరక్షణపై ఉదాహరణలతో అందరికీ అర్థమయ్యే విధంగా వివరించారు. మేడ్చల్ జిల్లా భూగర్భ జల స్థితిగతులను జిల్లా భూగర్భ జల అధికారి ఎం. హరీష్ బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కేంద్రీయ భూగర్భ జల మండలి మరియు భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన అక్విఫర్ మేనేజ్‌మెంట్, భూగర్భ జల గణన నివేదికలను అతిథులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీజీడబ్ల్యూబీ శాస్త్రవేత్తలు మాధవ్, యాదయ్య, రాంబాబు, అమన్ జైన్, భూగర్భ జల శాఖ అధికారులు సత్యనారాయణ, వంశీకృష్ణ, కార్తీక ప్రియ, కమల కుమారి, కార్తీక్, రాకేష్, పవన్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాంబశివరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# బీసీ బంద్ సందర్భంగా నమోదైన కేసుకు గోగికార్ శివకుమార్ హాజరు



**కాప్రా, మార్చి 11, (తెలంగాణ దిశ)** :బీసీ హక్కుల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2025 అక్టోబర్ 18న నిర్వహించిన బీసీ బంద్ సందర్భంగా కాప్రా ప్రాంతంలో జరిగిన ఒక చిన్న సంఘటనను ఆధారంగా తీసుకొని కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో తనతో పాటు తన టీమ్‌పై కేసు నమోదు చేసినట్లు బీసీ హక్కుల ఉద్యమకారుడు గోగికార్ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సమాజం న్యాయమైన హక్కుల కోసం జరిగిన శాంతియుత ఉద్యమంలో పాల్గొన్నందుకు కేసు నమోదు కావడం బాధాకరమని పేర్కొన్నారు. అయినప్పటికీ బీసీల హక్కుల సాధన కోసం జరిగే పోరాటంలో ఎన్ని కేసులు వచ్చినా, ఎన్ని సంవత్సరాలు అయినా తాను వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. బీసీ సమాజం ఐక్యత కోసం తాను ముందుండి పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తన కేసుకు పూర్తి న్యాయ సహాయం అందిస్తున్న బీసీ న్యాయవాదులకు గోగికార్ శివకుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# నిజాంపేట జర్నలిస్టు కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**కుత్బుల్లాపూర్, మార్చి 11, (తెలంగాణ దిశ)** :నిజాంపేట జర్నలిస్టు కాలనీలో మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించాలని కాలనీ నివాసితులు సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు కాలనీ వాసులు విన్నప పత్రాన్ని సమర్పించారు. కాలనీ ఏర్పాటు 2007లో అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా జర్నలిస్టులకు ప్లాట్లు కేటాయించి ఇళ్ల నిర్మాణానికి సహాయం చేసినట్లు నివాసితులు తెలిపారు. 2012 అక్టోబర్ 20 నుంచి కాలనీలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, అప్పట్లో సుమారు 200 ప్లాట్లలో 70 కుటుంబాలు మాత్రమే నివాసం ఉండేవని చెప్పారు. ఆ సమయంలో అవసరానికి అనుగుణంగా పంచాయతీ అధికారులు ఒక ఫీట్ పరిమాణంలో భూగర్భ డ్రైనేజీ పైపులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాలనీలో అన్ని ప్లాట్లలో ఇళ్లు నిర్మాణం పూర్తై చాలా మంది జీ ప్లస్--2 భవనాలు నిర్మించడంతో పాత డ్రైనేజీ వ్యవస్థ సరిపోవడం లేదని నివాసితులు తెలిపారు. డ్రైనేజీ లైన్లు తరచూ జామ్ అవుతూ మురుగు నీరు పొంగిపొర్లడంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతిరోజూ మున్సిపల్ సానిటేషన్ సిబ్బందితో డ్రైనేజీలను శుభ్రం చేయించాల్సి వస్తోందని తెలిపారు. కాబట్టి పురాతన డ్రైనేజీ పైపులను తొలగించి రెండు లేదా మూడు ఫీట్ల పరిమాణంలో నూతన భూగర్భ డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే కాలనీలో వీధి దీపాలను పెద్ద స్ట్రీట్ లైట్లతో ఏర్పాటు చేయాలని కోరారు. ఇటీవల కాలంలో కాలనీలో దోమల సంఖ్య విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవు తున్నారని పేర్కొంటూ వారంలో కనీసం రెండుసార్లు ఫాగింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వాటర్ ట్యాంక్ నుంచి జర్నలిస్టు కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న సాయిబాబా ఆలయం వద్ద డ్రైనేజీ లీకేజీల సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని నివాసితులు అధికారులను కోరారు. కాలనీ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ కాలనీ అధ్యక్షులు తన్నీరు శ్రీనివాస్, కార్యదర్శి కె. వెంకట్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ వాణిజ్య షెడ్డు నిర్మాణంపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం..!?

**ఘట్కేసర్, మార్చి 11, (తెలంగాణ దిశ)** : జాతీయ రహదారి అవుషాపూర్ నుంచి ఘట్కేసర్ సర్కిల్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొని ఎలాంటి అనుమతులు లేకుండా వాణిజ్య అక్రమ షెడ్డు నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని ఈ ప్రధాన రహదారిపై గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా వాణిజ్య షెడ్డు నిర్మాణం జరుగుతున్నా ఎంఎంసీ ఘట్కేసర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. సర్కిల్ టౌన్ ప్లానింగ్ కార్యాలయం, కమిషనర్, మల్కాజిగిరి జోన్ ఏసీపీలు ఈ నిర్మాణంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే విభాగాల్లో టౌన్ ప్లానింగ్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంటే, ఇలాంటి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు పత్రికల్లో ఈ విషయంపై కథనాలు వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం గమనార్హం. అక్రమ షెడ్ నిర్మాణం జరుగుతున్నప్పటికీ ఎంఎంసీ, ఘట్కేసర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం వహించడం దేనికి సంకేతమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్మాణంపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**కుత్బుల్లాపూర్, మార్చి 11, (తెలంగాణ దిశ)** :అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గణేష్ నగర్ పరిధిలోని పద్మనగర్ ఫేస్ -1లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అకోడే శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన సమక్షం లో కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా మున్సిపల్ కార్మికులకు కార్మికులకు చీరలు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి, డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ కెఎమ్. గౌరీష్, డివిజన్ అధ్యక్షులు ఎండి. జాకీర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, మన్నే రాజు,బేకు శ్రీనివాస్, బుయ్యని శివ కుమార్, కయ్యుమ్, జెస్సి పాల్, ప్రదీప్, కుమా ర్, ప్రవీణ్, సురేందర్, రమేష్, అక్బర్, సిద్దనోల సంజీవరెడ్డి, మైసిగారి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు సుజాత, సుజాత యాదవ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.



# రంజాన్ సందర్భంగా మైనారిటి కుటుంబాలకు తోఫాల పంపిణీ






**ఏఎస్ రావునగర్, మార్చి 11, (తెలంగాణ దిశ)** :రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్‌లోని మజీద్- ఎ- మమ్మదీయ మసీదు ప్రాంగణంలో మైనారిటీ కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున తోఫాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మసీదు అధ్యక్షులు లయన్ రియాజ్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు ముఖ్య అతిథిగా హాజరై మైనార్టీ సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన రంజాన్ తోఫాలను పంపిణీ చేసి ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ ఐక్యత, సేవాభావం సహనానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం మైనార్టీ కుటుంబాల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసాబ్ ఇక్బాల్, మొహాద్ ఘోసోద్దీన్ (సెక్రటరీ), గణిప్ప (వైస్ ప్రెసిడెంట్), యూసఫ్ (వైస్ ప్రెసిడెంట్), సలీం ఖాన్ (ట్రెజరర్), శైఖ్, బషీర్ అహ్మద్ (అడ్వైజర్), జమీల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, వి. రాజిరెడ్డి, మల్లేశం, నాగపురి రాజు, పార్టీ నాయకులు, మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రైతులకు కలిసి రాని కాలం

పంట పండించే రైతులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. విత్తనాలు మొదలుకుని, యూరియా, ఇతర క్రిమి సంహారక మందులు ఇలాఅనేక చోట్ల దగాపడుతూనే ఉన్నాడు. కాలం కలిసి వస్తే గిట్టుబాటు ధరల సమస్. కాలం కసలి రాకపోతే పంటలు ఎండిపోవడంతో వచ్చే కష్టాలు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతల విషయంలో ఎందుకనో స్పష్టమైన విధానంలో ముందుకు రావడం లేదు. రైతుభరోసా పేరుతో బురిడీ కొట్టించడం తప్ప సకాలంలో ఎరువులు విత్తనాలు సరఫరా చేయడం లేదు. యూరియా కష్టాలు తీరడం లేదు. పంటలను సకాలంలో కొనడం లేదు. కొన్నా గిట్టుబాటు ధరలు చెట్టించడం లేదు. ఈ సమస్యలు ఎవరు అధికారంలోకి వచ్చినా తీరడం లేదు. 2025 సంవత్సరంలో రైతులకు పెద్దగా లాభం దక్కలేదు. కష్టపడ్డా గిట్టుబాటు ధరలు దక్కలేదు. అన్ని పంటలకు ఇదే సమస్య ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ సమస్యల కారరణంగా రైతులు ఏటా చిత్తవుతున్నారు. ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రైతులను, నిపుణులను కూర్చోబెట్టి చర్చించడం లేదు. ఈయేడు పత్తి, మిర్చి, వరి పంటలను అధిక వర్షాలు దెబ్బతీసాయి. వచ్చిన పంటలను అమ్ముకుందామంటే గిట్టుబాటు ధరలు రావడం లేదు. రకరరకాల కారణాలతో గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదు. పత్తిరైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. అధిక వర్షాలతో పంట దిగుబడి తగ్గిందంటే ధరల్లో కోత విధించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదట్లో సీసీఐకి పత్తిని విక్రయించిన చాలామంది రైతులకు మద్దతు ధర లభించలేదు. తేమ పేరిట ధర తగ్గించడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కొద్దిమంది నిల్వచేసుకుని ఇప్పుడు అమ్ముకుందామంటే సీసీఐ కోత విధించడంతో పాటు పత్తి బీబీ స్పెషల్ నుంచి మెక్‌మోడ్ కుమారిందని నెల వ్యవధిలో రూ.100కు పైగా కోత విధించారు. అయినా మద్దతు ధరకు రూ.100 నుంచి రూ.200 వరకు తగ్గించి కొనుగోళ్లు చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వానలతో ఇబ్బందులు పడి పంటను సరైన ధర వచ్చే వరకు చూసి విక్రయిద్దామంటే ఇప్పుడు నాణ్యత పేరుతో కోతలు విధిస్తున్నారని, ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు పెట్టకుండా పంటను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఏటా పత్తి రైతుకు సీజన్ ఆరంభం నుంచి తిప్పలు తప్పడం లేదు. ప్రతికూల పరిస్థితుల్లో చేతికి వచ్చిన కొద్దిపాటి పత్తిని అమ్ముకునేందుకు కష్టాలు పడాల్సివస్తోంది. మొదట్లో తేమ పేరుతో మద్దతు ధర దక్కలేదు, ఇప్పుడేమో నాణ్యత లేదంటూ సీసీఐ ధరల్లో కోత విధించడంతో రైతులు నష్టపోతున్నారు. నెల రోజుల వ్యవధిలో రూ.100కు పైగా కోత పెట్టడంపై పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ రూ.8,010 మద్దతు ధర ఇస్తుండగా, గరిష్టంగా రూ.7,800 తో మాత్రమే పత్తి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఉభయ రాష్ట్రాల్లో వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేపట్టారు. జిల్లా కేంద్రంలో 1 చొప్పున కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఏర్పాటు చేసింది. పత్తిలో తేమ సంగతి పక్కన పెడితే పత్తిలో నాణ్యతాప్రమాణాలు తగ్గుతున్నాయని తొలుత రూ.50 కోత పెట్టి రూ.8,060 ధరతో కొనుగోళ్లు చేపట్టారు. మళ్లీ మరోమారు రూ.50 కోతపెట్టింది. ప్రస్తుతం పత్తిలో 8 శాతం తేమ ఉంటే రూ.8,010 మద్దతు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా, గరిష్టంగా రూ.7,800 ధర మాత్రమే పెడుతున్నట్లుగా రైతులు చెబుతున్నారు. సీసీఐ నిబంధనలతో విసుగు చెందిన రైతులు నగదు ధరలకు ప్రైవేట్ వ్యాపారులకు రూ.7 వేలకే విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు తక్కువ ధరలను చూపి పత్తి కొనుగోలు చేస్తూ రైతులను ముంచుతున్నారు. సీసీఐ నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా మారడంతో దిక్కుతోచని స్థితుల్లో గ్రామాల్లో ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముతున్నారు. రైతుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసిన వ్యాపారులు కపాస్ యాప్‌లో బుక్ చేసుకుని రైతుల పేరిట భూమి కాగితాలు, ఆధార్ చూపించి లాభాలు పొందుతున్నారు. వ్యాపారులకు కొనుగోలు సెంటర్ల వద్ద కొంతమంది ఆఫీసర్లు కొమ్ముకాస్తున్నారనే విమర్శలున్నాయి. సీసీఐ తీరుతో రైతులు నష్టపోతుండగా, రైతుల నుంచి కొనుగోలు చేసి వ్యాపారం చేసే దళారులు బాగుపడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఆంధ్రాలో 2025 సంవత్సరం మొత్తంలో రైతు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర కాదు కదా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కూడా రాలేదు. మిర్చి ధర సగానికి పడిపోయింది. ప్రభుత్వం ప్రకటించిన వ్యత్యాస ధర పథకం ఏమైందో తెలియదు. పొగాకు లెటర్ ఇచ్చిన కంపెనీలు పొగాకు కొనకుండా ఎగనామం పెట్టారు. ప్రభుత్వం 6 వేలకు, 9 వేలకు కొనిపిస్తానని కేంద్రాలు తెరిచింది. ప్రభుత్వం ప్రకటించిన ధర 10 శాతం మందికి కూడా రాలేదు. అత్యధిక భాగం 3 వేలకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇంకా రైతుల దగ్గర పొగాకు ఉండిపోయింది. ఉల్లి రైతుకు కిలోకు రూపాయి కూడా రాని సందర్భాలు ఉన్నాయి, పారబోసిన సందర్భాలు ఉన్నాయి, పశువులను మేపిన సందర్భాలు ఉన్నాయి. హెక్టారుకు 50 వేలు ఎవరికి ఇచ్చారో, ఎందరికి ఇచ్చారో తెలియదు. మామిడి రైతులకు కిలో 12 రూపాయలకు కొనాలని, 4 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ముదరా ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ముదరా 190 కోట్లు తీసుకున్న ఫ్యాక్టరీలు కుమ్మక్కై కిలో రూ.3 నుండి రూ.6 మధ్యనే కోనుగోలు చేశాయి. రైతులు రోడ్లపై పారబోయడం, చెట్లను నరికి వేయడం చూశాం. కోకో రైతులకు 11.84 కోట్ల రూపాయలు ఇచ్చారు. సగం మంది రైతులకే అందాయి. ముందుగా అమ్ముకున్న రైతులు ఉసూరుమన్నారు. పత్తి సిసిఐ కొనుగోలు కేంద్రాలు పెట్టినా ప్రైవేట్ వ్యాపారుల పెత్తనమే సాగింది. క్వింటాలు రూ.7710 మద్దతు ధర కాగా, రైతులు రూ.5000 నుండి రూ.600 0 మధ్యనే అమ్ముకుంటున్నారు. టమోటా రైతులు పశువులు మేపుకున్న పరిస్థితి చూశాం. పప్పుసెనగ, మొక్కజొన్న అయినకాడికి అమ్ముకోవడం తప్ప ప్రభుత్వం ఆదుకున్నది లేదు. అరటికాయలు మార్కెట్‌కు తెచ్చిన ఖర్చులు కూడా రావడం లేదని తోటలలో వదిలివేయడం, పశువులను మేపడం చూశాం. రైతులు కోల్పోయింది వేల కోట్లు, ప్రభుత్వం చెల్లించింది 201 కోట్లుగా తేలింది.

# విద్యార్థుల కళలకు గుర్తింపు వచ్చేలా వెబ్ సైట్ ఏర్పాటు చేయాలి

### - కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 11 (తెలంగాణ దిశ)** :విద్యార్థులలో దాగి ఉన్న కళలు మరుగున పడకుండా వాటికి సరైన గుర్తింపు లభించేలా ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించి అందులో వారి ప్రతిభను అప్‌లోడ్ చేయాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. బుధవారం ఘట్‌కేసర్ మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మధ్యాహ్న భోజనాన్ని ప్రతిరోజూ మెనూ ప్రకారం సమయానికి, పౌష్టికాహారంతో విద్యార్థులకు అందించాలని అధికారులకు సూచించారు. వసతి గృహంలో బోధన విధానం, అందుతున్న సౌకర్యాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్కూల్‌లోని కూచిపూడి, గిటార్, కీబోర్డ్, పెయింటింగ్ వంటి విభాగాలను పరిశీలించి, విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న సర్టిఫికేట్ కోర్సుల వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులు రూపొందించిన పెయింటింగ్స్‌ను పరిశీలించిన ఆయన, ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్ రూపొందించి అందులో ఈ పెయింటింగ్స్‌ను ఉంచితే ఆసక్తి గల వారు ఆర్డర్లు ఇవ్వవచ్చని సూచించారు. అలాగే సంగీత వాద్యాలు నేర్చుకున్న విద్యార్థులు ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ వారికి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఆడుకునేందుకు ఫుట్‌బాల్, చెస్, వాలీబాల్ వంటి ఆట సామగ్రి, అలాగే ఆర్ట్స్‌కు అవసరమైన పరికరాలు అందించాలని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ అవసరమైన వస్తువులను తప్పకుండా



అందిస్తామని హామీ ఇచ్చారు. స్కూల్ యాజమాన్యం అవసరమైన సామగ్రి, విద్యార్థులు కోరిన ఆట వస్తువులు తదితర అంశాలపై ప్రతిపాదనలు తనకు పంపాలని సూచించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, వంట సామాగ్రిపై ఎక్స్‌పైరీ తేదీలను పరిశీలిస్తూ గడువు ముగియకముందే వాటిని వినియోగించాలని, నాణ్యత గల వస్తువులనే ఉపయోగించాలని సూచించారు.

# కాప్రాలో బస్తీబాటకు విశేష స్పందన

- కాలనీలలో అభివృద్ధి పనులకే ప్రాధాన్యత
- సకాలంలో పెండింగ్ పనుల పూర్తి చేసేలా చర్యలు
- కాప్రా సర్కిల్ లో "బస్తీబాట" లో పరమేశ్వర్ రెడ్డితో కలిసి పాల్గొన్న స్వర్ణరాజ్ శివమణి





**కాప్రా, మార్చి 11, (తెలంగాణ దిశ)** :కాలనీలలో సమగ్ర అభివృద్ధికే అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి కాలనీని ఒక యూనిట్ గా తీసుకుని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కొన్ని కాలనీలలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టనున్నట్లుగా తెలిపారు. బుధవారం కాప్రా సర్కిల్ లోని పలు ప్రాంతాల్లో బస్తీ బాట చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పరమేశ్వర్ రెడ్డి దృష్టికి స్థానిక సమస్యలపై వినతిపత్రాలను అందచేశారు. గోపాలరెడ్డి నగర్, రాజీవ్ ఎన్ క్లేవ్, రెడ్డి కాలనీలలో డ్రైనేజీ పైపు లైన్ సమస్యలు తెచ్చారు. ప్రస్తుతం ఈ పనులు పెండింగ్ లో ఉన్నాయని, అతి త్వరలోనే పనులను చేపట్టి పూర్తి చేసేలా చర్యలు చేపట్టనున్నట్లుగా పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శ్రీ సాయి ఎంక్లేవ్, కృష్ణ నగర్, లక్ష్మి నగర్, ఓఆర్ఆర్ పైప్ లైన్లు పూర్తి అయ్యాయి కానీ మంచి నీరు వదలడం లేదని ఇక్కడి వాసులు పరమేశ్వర్ రెడ్డికి వివరించారు. ఈ సమస్యను సైతం వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టను న్నట్లుగా పరమేశ్వర్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణానగర్ జనార్ధన్, లక్ష్మీనగర్, బాబు, గోపాల్ రెడ్డి నగర్ ప్రవీణ్, వంపుగూడ మల్లారెడ్డి, రాజీవ్ ఎన్ క్లేవ్, నాయక్, బ్యాంక్ కాలనీ లచ్చయ్య, కృష్ణానగర్ రాఘువేందర్ రెడ్డి, శాలివాహన ఎంక్లేవ్ శ్రీలత, గౌరీనాథపురం రమణారెడ్డి, సిఎస్ నగర్ రఘురాం రెడ్డి, మల్లికార్జున్ నగర్ జగదీష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ స్వర్ణ రాజు శివమణి, ధనపాల్ రెడ్డి, సీతారాం రెడ్డి, కొత్త అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అహ్మద్ ఐఏఎస్‌కు ఘనంగా సన్మానం




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 11, (తెలంగాణ దిశ)** :మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)గా పనిచేస్తున్న ఫైజాన్ అహ్మద్ ఐఏఎస్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా చైర్మన్ బి. రవి ప్రకాష్ అధ్యక్షతన కమిటీ ప్రతినిధుల బృందం అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక సంఘాలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో సహకారం అందించాలని కమిటీ ప్రతినిధులు ఆయనను కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వై. రమేశ్వర్ గౌడ్ (అదనపు జనరల్ సెక్రటరీ), బి. వెంకటేశ్వర్లు (కో–చైర్మన్), ఎం. మధన్ రెడ్డి, ఎం. విఠల్, ఎం. శ్రీనివాస్ (వైస్ చైర్మన్‌లు), బి. భారత్ కుమార్, డిప్యూటీ సెక్రటరీ యాదగిరి, మహేష్, శ్రీనివాస్, నాచారయ్య, శ్రీనివాస్ (పీఎన్ జిఓఎస్ మల్కాజిగిరి యూనిట్ సెక్రటరీ), కలెక్టర్ కార్యాలయ టీఎన్జీవోఎస్ అధ్యక్షుడు కార్తిక్, సెక్రటరీ అక్షయ్, ఉమాకాంత్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌బి కాలనీలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు





**హెచ్‌బి కాలనీ, మార్చి 11, (తెలంగాణ దిశ)** :అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హెచ్‌బి కాలనీ ఫేజ్--2 కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు వంజరి ప్రవీణ్ కరిపే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి, కేక్ కట్ చేసి మహిళా మణులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళలు లేనిదే సృష్టి లేదని, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం కల్యాణలక్ష్మి, ఆరోగ్య మహిళ, ఒంటరి మహిళ, మాతా, శిశు పథకాలు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని గుర్తు చేశారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. ఒక మహిళ అభివృద్ధి చెందితే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, కుటుంబం అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. మహిళలు రాజకీయాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని, వారికి చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మల్లేష్ గౌడ్, దేవేందర్ కుమార్, చారి, బాలయ్య గౌడ్, నవీన్ గౌడ్, కుమార్, రామకృష్ణ, కిరణ్, జయపాల్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మహిళా నాయకులు భాగ్యమ్మ, పర్వీన్, జ్యోతి, రత్నమాల, లక్ష్మీ, డప్పు లక్ష్మీ, భారతి, అలివేలు, శారద, సృజన, కొమురమ్మ, స్వరూప, శోభా, సంతోష, లావణ్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

# నేడు మహిళా జన్ సున్వాయ్‌లో ఫిర్యాదుల స్వీకరణ

### - జిల్లా కలెక్టర్ మను చౌదరి




మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 11, (తెలంగాణ దిశ) :అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సమస్యలను నేరుగా విని పరిష్కరించేందుకు జాతీయ మహిళా కమిషన్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 8 నుంచి 13 వరకు దేశవ్యాప్తంగా జాతీయ మహిళా కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్ల ఆధ్వర్యంలో మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మార్చి 12 గురువారం మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌లో మహిళా జన్ సున్వాయ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహత్కర్ అధ్యక్షత వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని మహిళల సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి, వాక్–ఇన్ ఫిర్యాదులను కూడా స్వీకరించ నున్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో కోరారు.

# సాయి కృష్ణనగర్ సమస్యలను పరిష్కరిస్తా

### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, మార్చి 11, (తెలంగాణ దిశ)** :ఉప్పల్ నియోజకవర్గంలోని వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాయి కృష్ణ నగర్ కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో పర్యటిస్తూ స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీ వాసులు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, స్ట్రీట్ లైట్లు, తాగునీటి సమస్యలు వంటి పలు మౌలిక సదుపాయాల లోపాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందించడం తన బాధ్యత అని, ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బాలకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎకరం రూ.177 కోట్లు

హైదరాబాద్, : హైదరాబాద్‌లోని రాయదుర్గం ప్రాంతంలో భూమి వేలం రికార్డు సృష్టించింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరానికి రూ.177 కోట్లు చొప్పున భూమి పలికింది. టీజీఐఐసీ నిర్వహించిన ఈ వేలంలో, మొత్తంగా ఏడు ఎకరాల 67 సెంట్ల భూమిని ఎంఎస్ఎన్ రియాలిటీస్ అండ్‌ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేజిక్కించుకుం ది. ఈ సంస్థ మొత్తం రూ.1,357 కోట్లకు ఈ భూమి సొంతం చేసు కుంది.టీజీఐఐసీ అధికారుల ప్రకారం, ఈ వేలం రూ.1,357 కోట్లతో పూర్తి అయింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ, హైదరాబాద్ షెడ్యూల్డ్ ఏరియాలో భాగంగా ఉన్న ఈ ప్రాంతం, ఐటీ, ఫార్మా, బయోటెక్ వంటి కంపెనీల కార్యాలయాలకు అనుకూలంగా ఉంది. గతంలో రాయదుర్గంలో ఎకరానికి రూ. 100–120 కోట్ల వరకు పలికేవి.

# దమ్మాయిగూడ డివిజన్ పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించాలి

## - జోనల్ కమిషనర్‌కు వినతి మాజీ సర్పంచ్, మాజీ కౌన్సిలర్ పాండల అనురాధ యాదగిరి గౌడ్ వినతి



**దమ్మాయిగూడ, మార్చి 11 , (తెలంగాణ దిశ)** :మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ నాలుగవ డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ సర్పంచ్, మాజీ కౌన్సిలర్ పాండల అనురాధ యాదగిరి గౌడ్ మల్కాజిగిరి జోన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్ కు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగారం నుండి దమ్మాయిగూడ వరకు రహదారి తీవ్రంగా దెబ్బతిన్నదని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే దమ్మాయిగూడ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు పూర్తిగా నిలిచిపోయాయని, వాటిని వెంటనే ప్రారంభించాలని తెలిపారు. కాలనీల్లో వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా దోమల నివారణకు వెంటనే ఫాగింగ్ నిర్వహించాలని, మారుతి నగర్ నుండి బాలకృష్ణ రెడ్డి ఇంటి పరిసర ప్రాంతాల్లో డ్రైనేజ్ సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యలతో పాటు దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో జలమండలి ద్వారా సరైన తాగునీటి సరఫరా అందడం లేదని, ప్రతిరోజూ నీటి సరఫరా చేయాలని కోరారు. ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యలను అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని పాండల అనురాధ గౌడ్ వినతి పత్రంలో కోరారు.

# గోపాల్ రెడ్డినగర్‌లో రూ.28 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



**కాప్రా, మార్చి 11, (తెలంగాణ దిశ)** :కాప్రా డివిజన్ పరిధిలోని గోపాల్ రెడ్డి నగర్‌లో రూ.28 లక్షల నిధులతో చేపట్టనున్న రోడ్డు అభివృద్ధి పనులకు ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రాంత ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రాంత ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్ స్థానిక నాయకులు, ప్రజలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు







**మల్లాపూర్, మార్చి 11, (తెలంగాణ దిశ)** :మల్లాపూర్ డివిజన్‌లోని మున్సిపల్ వార్డ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన శ్రీ శక్తి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నెమలి అనిల్ కుమార్ హాజరై మహిళలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు నేటి సమాజంలో ప్రతి రంగంలో ముందంజలో నిలుస్తూ కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళల సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ప్రోత్సాహం కలిగేలా శ్రీ శక్తి అవార్డులను ఏర్పాటు చేసి ఘనంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు






**కాప్రా, మార్చి 11, (తెలంగాణ దిశ)** :కాప్రా మండలంలోని గాంధీనగర్ ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయులు మంజుల, రమలను ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నేటి సమాజంలో అన్ని రంగాలలో మహిళలు ప్రతిభ చాటుకుంటున్నారని, విద్యార్థులు తమ ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకొని బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాలరాజు, రాఘవేందర్ గౌడ్, వేణుమాధవ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కోనసీమలో కొబ్బరి చెట్లు ఏమౌతున్నాయి..



**కాకినాడ,తెలంగాణ దిశ :** కోనసీమ పేరు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది పచ్చని కొబ్బరి చెట్లు. రోడ్డు.. ఆ రోడ్డుకు ఇరువైపులా ఉండే కొబ్బరి చెట్లు.. వాటి మధ్యన ప్రయాణం.. మనసుకు ఓ ప్రశాంతత. కానీ కోనసీమలో ఇప్పుడు ఆ కొబ్బరి చెట్లు కనుమరుగువతున్నాయి. కన్నకొడుకులా పెంచుకున్న ఆ కొబ్బరి చెట్లు వాడిపోతున్నాయి.. ఆ తర్వాత కూలిపోతున్నాయి. దీంతో ఆ రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. అసలింతకీ.. కొబ్బరి చెట్లు ఎందుకు కూలుతున్నాయి? దానికి కారణం ఏంటి? అసలేం జరుగుతోంది? సముద్రపు నీరు చేరడంతో కుళ్లిపోతున్న కొబ్బరి చెట్లు.. కోనసీమలోని కొబ్బరి చెట్లు చనిపోతుండటంతో ఇప్పుడు ప్రత్యక్షంగా 10 గ్రామాలు.. పరోక్షంగా 20 గ్రాముల రైతులు నష్టపోతున్నారు. దీనికి కారణం శంకర గుప్తం డ్రైనేజీ. వైనతేయ నదీ పాయలో సముద్రం పోటు సమయంలో వచ్చిన నీరు శంకర గుప్తం డ్రైనేజీ ద్వారా చింతలపూడి గ్రామం వరకు వెనక్కి రావడంతో కొబ్బరి తోటలలో ఆ సముద్రపు నీరు నిలిచిపోతుంది. శంకరగుప్తం మేజర్ డ్రైనేజీ వైనతేయ నది లింక్ ఉంది. శంకరగుప్తం డ్రైయిన్‌కి ప్రధానంగా నాలుగు లింక్ డ్రైనేజీలు ఉన్నాయి. ఒకటి అంతర్వేది, రెండు వేప చెట్టు డ్రెయిన్, పోలవరం డ్రెయిన్, నాలుగు ముత్యాల పేట డ్రెయిన్. ఈ నాలుగు డ్రెయిన్‌ల నుంచి వచ్చే నీరు వల్ల గ్రామాలు దెబ్బతింటున్నాయి. దీనికి అధ్యయ నం చేయడానికి హార్టికల్చర్, అగ్రికల్చర్, బి డబ్ల్యు టి, స్కాలర్స్, ఫిలాసఫర్స్, సైంటిస్టులు వచ్చారు.. వచ్చారు చూసారు వెళ్లారు గాని ఎవ్వరు నివేదికలు ఇవ్వలేదంటున్నారు గ్రామస్తులు. ాజౌఉఅ రిగ్గల వేస్ట్ ఆయిల్ సముద్రంలో కలుస్తోందని ఆరోపణలు.. ాజౌఉఅ రిగ్గలు గ్రామాల చుట్టుపక్కల ఎక్కువగా ఉండటంతో వాటి నుండి వచ్చే వేస్ట్ ఆయిల్ అంత సముద్రంలోకి విడిచి పెడుతున్నారని చెబుతున్నారు. సముద్రపు నీరు పూర్తిగా కలుషితమవుతుందన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇకపై తాము ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని చెబుతున్నారు. కోనసీమ నుంచి ఆర్మీలో పని చేస్తూ దేశానికి సేవలందిస్తున్నారు రాజేష్. మరో ఏడాదిలో రిటైర్‌మెంట్ తీసుకుని స్వస్థలానికి వచ్చి తన కొబ్బరి తోట చూసుకుందామనుకునేది ఆయన ఆలోచన. కానీ ఇప్పుడు తన తోటకు వస్తే దుఃఖం వస్తుందంటున్నారు. నేల కూలిన కొబ్బరి చెట్లను చూసి గుండె బరువెక్కుతుందని ఆవేదన చెందుతున్నారు. కొబ్బరిపై ఆధారపడ్డ పరిశ్రమలు మూతపడ్డాయన్న రైతులు.. కోనసీమ కొబ్బరి రైతులు ఇలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని 2014 ఇప్పటివరకు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు అదే గ్రామానికి చెందిన దొరబాబు అనే వ్యక్తి కొబ్బరి తాడును తయారు చేయడం.. ఆదాయం లేక చాలా మంది పూర్తిగా గ్రామాన్ని వదిలి వలస వెళ్లే పరిస్తితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఆయన. రాజోలు నియోజకవర్గంలో అనేక గ్రామాలలో ాజౌఉఅ రిగ్గులు ఉన్నాయి.

# పెరాలసిస్ వారి కోసం ఆవిష్కరణ

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** టెక్నాలజీ సాయంతో పూర్తిగా శరీరం పక్షవాతానికి గురైన వారికి సహాయం అందించే పరికరాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు రూపొందించారు. ఈ నూతన ఆవిష్కరణ పక్షవాత రోగులకు స్వతంత్రంగా జీవించే అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ పరికరం సహాయంతో రోగులు తమ వీల్‌చైర్‌ను నియంత్రించడం, అర్జెంట్‌గా ఎదైనా అవసరం అయితే అభ్యర్థించడం, ఇంట్లోని విద్యుత్ పరికరాలను కూడా ఆపరేట్ చేయడం సాధ్యమవుతుంది. బయోమెడికల్ ఫైనల్ ఇయర్ ఇంజినీరింగ్ చదువుతున్న ఈ విద్యార్థులు రూపొందించిన ఈ ప్రాజెక్ట్‌కు 'పక్షవాత రోగుల కోసం ఇంటిగ్రేటెడ్ సహాయక సాంకేతిక వ్యవస్థ అని పేరు పెట్టారు. ఈ ఆవిష్కరణ 'హాక్-ఎ-బోర్డ్ హ్యాకథాన్' ఫైనల్‌లో మొదటి బహుమతిని గెలుచుకుంది. ఈ పరికరం పని చేయడానికి ముఖ్యంగా మూడు టెక్నాలజీలను ఉపయోగించారు.

ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్ . వినియోగదారు ముఖ కదలికలను గుర్తించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఎసీ).. దీని ద్వారా ఇంటిలోని స్విచ్‌లు వంటి వాటిని నియంత్రించవచ్చు. బాహ్యంగా జత చేసిన స్క్రీన్.. ఆదేశాలను వీక్షించడానికి ఉపయోగపడుతుందిఈ బృందంలోని హారిక అనే విద్యార్థి మాట్లాడుతూ.. మెడ కింది భాగం నుండి కండరాల కదలికను కోల్పోయిన రోగులు కుటుంబ సభ్యులపై పూర్తిగా ఆధారపడటం తప్ప వేరే మార్గం లేదని అన్నారు. అలాంటి వారికి సహాయం చేయాలనే ఉద్దేశంతోనే ఈ ఉత్పత్తిని రూపొందించినట్లు, దీనిని ఏ వీల్‌చైర్‌కు లేదా బెడ్‌కు అయినా జత చేయవచ్చని వివరించారు. వినియోగదారు ముక్కు కొన స్థానాన్ని ట్రాక్ చేయడం ద్వారా వివిధ పనులు చేస్తుంది. వీల్‌చైర్‌కు జతచేసిన స్క్రీన్ ముందు వినియోగదారు ముఖాన్ని లేదా తలను కదిలించి.. ఒక నిర్ణీత స్థానంలో మూడు సెకన్ల పాటు ఆపితే.. యాక్షన్ ఎంపిక అవుతుంది. అత్యవసర పరిస్థితుల్లో ముందుగా నమోదు చేసుకున్న కొన్ని నంబర్‌లకు కాల్ చేసి సహాయం కోరడానికి కూడా ఇది అవకాశం ఇస్తుంది. దీనివల్ల ఇతరులపై ఆధారపడటం తగ్గుతుంది. ఈ ప్రాజెక్ట్‌లో పనిచేసిన మరో విద్యార్థి వెంకట జైదీప్ దత్తా మాట్లాడుతూ..

ఈ వ్యవస్థను ప్రాథమిక శిక్షణతో కూడా ఆపరేట్ చేయవచ్చని.. ఇది అందుబాటులో, చౌకగా ఉంటుందని తెలిపారు. మార్కెట్లో ప్రస్తుతం ఉన్న ఖరీదైన ఉత్పత్తులకు ఇది తక్కువ ధరకే అంటే.. సుమారు రూ.8,000 నుండి రూ.10,000 మధ్య ఉంటుందన్నారు. ముఖ్యంగా.. మాట్లాడలేని వారికి కూడా ఈ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుంది. ఆహారం, నీరు కావాలని కోరడం లేదా రెస్ట్ రూమ్‌కి వెళ్ళడానికి సహాయం అడగడం వంటి ప్రాథమిక అవసరాలకు దీనిని వినియోగించుకోవచ్చు. ఈ వ్యవస్థ ఇంగ్లీషుతో పాటు తొమ్మిది భారతీయ భాషలలో సమాచార మార్పిడికి సపోర్ట్ చేస్తుందన్నారు.

# చేశాం... చెప్పుకోలేకపోయాం!

**కడప,తెలంగాణ దిశ :** మేం చేసింది చెప్పుకోలేకపోయాం. ప్రజలకు అన్నీ చేశాం కానీ? వాటిని ప్రచారం చేసుకోలేకపోయాం.. ఇటీవల జగన్మోహన్ రెడ్డిపార్టీ శ్రేణుల వద్ద వ్యక్తంచేసిన బాధ ఇది. అయితే ఆయన బాధకు కారణం కూటమి ప్రభుత్వంచర్యలు. ఒకవైపు అభివృద్ధి చేస్తోంది. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఎక్కడా ఆర్భాటం చేయడంలేదు. కానీ ప్రజల్లోకికూటమి ప్రభుత్వంపనులు వెళుతున్నా యి. ప్రజల నుంచి సానుకూలత వస్తోంది. అలాగని వైసీపీ మాదిరిగా వాలంటీర్లు లేరు. ఐ ప్యాక్ లాంటి టీం కూడా లేదు. అయినా సరే కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజల్లోకి వెళ్తున్నాయి. దీనిని చూసి జగన్మోహన్ రెడ్డి తలలు పట్టుకుంటున్నారు. అయితే అప్పటికీ, ఇప్పటికీ ఆయన తేడా గుర్తించలేకపోవడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లోటు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో వాలంటీర్లు ఉండేవారు. ప్రతి 50 కుటుంబాల బాధ్యతల ను చూసేవారు. వారే ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేసేవారు. చక్కటి చిరునవ్వుతో లబ్ధిదారులను పలకరించేవారు. అయితే ఆ పింఛన్ అందిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కాదని.. అసలు ప్రజా ప్రతినిధులతో సంబంధం లేదని.. వాలంటీర్ల చొరవతోనే తమకు పింఛన్లు అందుతున్నాయని భావించేవారు లబ్ధిదారులు. అస్సలు పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు, మంత్రుల జోక్యం ఉండేది కాదు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అలా కాదు. సీఎం చంద్రబాబు ప్రతినెలా ఒకటో తేదీన ఏదో ఒక జిల్లాకు వెళుతున్నారు. స్వయంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఎమ్మెల్యేలతో పాటు మంత్రుల సైతం ప్రజల్లోకి వెళ్లి పింఛన్లు అందించగలుగుతున్నారు. తద్వారా సంక్షేమ పథకాలు బాగానే అమలు చేస్తున్నామని.. బాధ్యతగా పర్యవేక్షిస్తున్నామని ప్రజలకు సంకేతాలు పంపగలుగుతున్నారు. ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడంలో కూటమి ప్రభుత్వం సక్సెస్ అయ్యింది. విజయవాడలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటోల్లోనే ప్రయాణించి వేదిక వద్దకు చేరుకున్నారు. వేలాది మంది ఆటో డ్రైవర్ల సమక్షంలో పథకాన్ని ప్రారంభించారు. వీలున్నంతవరకు ఎటువంటి హడావిడి లేకుండా.. ఆటో డ్రైవర్లతో మమేకం అయ్యారు.

జిల్లా కేంద్రాల్లో మంత్రులు, నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు కార్యక్రమా న్ని దిగ్విజయంగా జరిపించారు. ప్రజల కోసం కూటమి ప్రభుత్వం ఏదో చేస్తుందన్న ఆలోచనను ప్రజల్లోకి పంపగలిగారు. అయితే జగన్మోహన్ రెడ్డి మాత్రం తాము ఎన్నో చేశామని.. చెప్పుకోలేకపో యామన్న బాధ వెనుక..

కూటమి ప్రభుత్వ చర్యలు స్పష్టంగా కనిపిస్తు న్నాయి. అప్పట్లో ప్రభుత్వ పథకం అమలు చేసిన క్రమంలో మీడియా కు ప్రకటనలు ఇచ్చేవారు. వాలంటీర్లతో పని పూర్తి చేయించేవారు.

తాను మాత్రం తాడేపల్లిలో బటన్ నొక్కేవారు. ఎమ్మెల్యేలతో పాటు మంత్రులకు, ముఖ్య నాయకులకు ఎటువంటి పని లేకుండా చేసేవారు. ఆ విషయాన్ని మరిచి తాము అన్నీ చేశామని. కానీ చెప్పుకోలేకపోయామన్న బాధ పడుతున్నారు. కానీ అసలు విషయాన్ని గ్రహించారు కానీ.. ఆయన ఎట్టి పరిస్థితుల్లో చెప్పుకోలేరు.

# ఎకరం రూ.177 కోట్లు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లోని రాయదుర్గం ప్రాంతంలో భూమి వేలం రికార్డు సృష్టించింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరానికి రూ.177 కోట్లు చొప్పున భూమి పలికింది. టీజీఐఐసీ నిర్వహించిన ఈ వేలంలో, మొత్తంగా ఏడు ఎకరాల 67 సెంట్ల భూమిని ఎంఎస్ఎన్ రియాలిటీస్ అండ్‌ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేజిక్కించుకుం ది. ఈ సంస్థ మొత్తం రూ.1,357 కోట్లకు ఈ భూమి సొంతం చేసు కుంది. టీజీఐఐసీ అధికారుల ప్రకారం, ఈ వేలం రూ.1,357 కోట్లతో పూర్తి అయింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ, హైదరాబాద్ షెడ్యూల్డ్ ఏరియాలో భాగంగా ఉన్న ఈ ప్రాంతం, ఐటీ, ఫార్మా, బయోటెక్ వంటి కంపెనీల కార్యాలయాలకు అనుకూలంగా ఉంది. గతంలో రాయదుర్గంలో ఎకరానికి రూ. 100-120 కోట్ల వరకు పలికేవి. ఈ సారి భారీగా పెరిగాయి. ఈ వేలంలో పాల్గొన్న మరో కొన్ని సంస్థలు కూడా పోటీ పడ్డాయి, కానీ ఎంఎస్ఎన్ రియాలిటీస్ అత్యధిక బిడ్‌తో విజయం సాధించింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఉన్న ఈ భూమి, టీజీఐఐసీ అభివృద్ధి చేస్తున్న ఇండస్ట్రియల్ పార్క్‌లో భాగం. వేలం ప్రక్రియలో మొత్తం 7.67 ఎకరాల భూమి వేలం వేశారు. ఎకరానికి రూ.177 కోట్లు ధర నిర్ణయమై, మొత్తం మొత్తంగా రూ.1,357 కోట్లు వసూలైంది. ఈ ధరలో భూమి అభివృద్ధి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సౌకర్యాలు కూడా చేరుతాయి. ఐటీ కారిడార్ మధ్యలో నాలెడ్జ్ సిటీ, ఫార్మా సిటీ, ఐటీ పార్కుల మధ్య ఈ స్థలం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్లాన్. గత రెండు సంవత్సరాలుగా ఇక్కడ భూమి ధరలు రెండు రెట్లు పెరిగాయి. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి విపులమైన ఆదాయం లభించడంతో, మరిన్ని ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు మార్గం సుగమమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఎంఎస్ఎన్ రియాలిటీస్ అండ్‌ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ. ఈ సంస్థ గతంలో కూడా రాయదుర్గం ప్రాంతంలో పెద్ద భూములు కొనుగోలు చేసి, కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు అభివృద్ధి చేసింది. ఈ కొత్త భూమిపై ఐటీ పార్కులు, కార్పొరేట్ ఆఫీసులు నిర్మించే అవకాశం ఉంది. టీజీఐఐసీ ఎండీ శశాంక మాట్లాడుతూ.. తాజా ధర రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో మునుపటి రికార్డులను బద్దలు కొట్టిందని తెలిపారు. 2022లో కోకాపేట నియోపోలీస్‌లో జరిగిన వేలంలో ఎకరాకు రూ.100.75 కోట్లు గరిష్ఠ ధర పలికిన రికార్డును.. ఈ రాయదుర్గం నాలెడ్జ్ సిటీ వేలం అధిగమించింది. కొత్త రికార్డు ధర రూ.177 కోట్లు కావడంతో.. ఇది గత కోకాపేట ధర కంటే దాదాపు 75% అధిక వృద్ధిని సాధించినట్లు ఆయన వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం పారదర్శక, వ్యాపారానుకూల వాతావరణాన్ని నిర్మిస్తోందని.. పెట్టుబడిదారులు హైదరాబాద్ భవిష్యత్తుపై ఉంచిన నమ్మకానికి ఈ వేలం నిదర్శనమని శశాంక పేర్కొన్నారు. ఈ వేలాన్ని జేఎల్ఎల్ ఇండియా, ఎంఎస్టీసీ సంస్థల భాగస్వామ్యంతో పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఒకవైపు రాయదుర్గంలో వాణిజ్య భూములకు భారీ ధరలు పలకగా.. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో నివాస భూములు సైతం రికార్డు స్థాయి ధరలను నమోదు చేశాయి.

# నారింజ మెరుగులు



ఆరోగ్యానికి తాజా పండ్లే కాదు.. వాటి తొక్కలూ ఎంతో మేలు చేస్తాయి. ముఖ్యంగా, నారింజ తొక్కల్లో అందానికి మెరుగులద్దే సుగుణాలు ఎన్నో ఉంటాయి. చర్మ సంరక్షణలో ఎంతగానో సహకరిస్తాయి. ఇందులోని పోషకాలు.. మచ్చలు, ముడతలను తగ్గించి, చర్మాన్ని కాంతిమంతంగా మార్చడంలో అద్భుతంగా పనిచేస్తాయి. అందుకే.. నారింజ తొక్కలను ఎన్నో రకాల సౌందర్య ఉత్పత్తుల్లో వాడుతుంటారు. అయితే, ఇంట్లోనే నారింజ తొక్కలతో సహజసిద్ధమైన బ్యూటీ ప్రొడక్ట్స్‌ను తయారుచేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం నారింజ తొక్కలను నీడలో ఆరబెట్టి.. పొడి చేసుకొని గాలి చొరబడని డబ్బాలో భద్రపరచుకోవాలి. ఒక గిన్నెలో టేబుల్ స్పూన్ నారింజ తొక్కల పొడిని తీసుకోవాలి. దీనికి టమాటా రసం, పెరుగు, పాలు, ఆలివ్ ఆయిల్, తేనె.. వీటిలో దేన్నయినా టేబుల్ స్పూన్ కలపాలి.

ఈ మిశ్రమాన్ని ముఖానికి ఫేస్‌ప్యాక్‌లా వేసుకొని, 20-30 నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే.. చర్మం కాంతిమంతంగా తయారవుతుంది. టేబుల్ స్పూన్ నారింజ తొక్కల పొడిలో చక్కెర, తేనె, ఆలివ్ ఆయిల్ ఒక్కో టీ స్పూన్ చొప్పున తీసుకోవాలి. వీటిని బాగా కలిపి.. ముఖానికి స్క్రబ్ చేసుకుంటే.. చర్మంపై ఉండే మృతకణాలు తొలగిపోతాయి. వైట్‌హెడ్స్, బ్లాక్‌హెడ్స్‌ను నివారించడంలోనూ ఈ స్క్రబ్ సమర్థంగా పనిచేస్తుంది. చర్మం మృదువుగా మారుతుంది.

ఒక టేబుల్ స్పూన్ నారింజ తొక్కల పొడిలో కొద్దిగా ముల్తానీ మట్టి, చిటికెడు పసుపు, పాలు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకొని.. పది నిమిషాల తర్వాత కడిగేయాలి. జిడ్డు తొలగిపోయి, ముఖం నిగారిస్తుంది. ముఖంపై ట్యాన్‌ను తొలగించడంలోనూ ఈ పొడి ముందుంటుంది. ఒక టేబుల్ స్పూన్ నారింజ తొక్కల పొడిలో.. ఒక టీస్పూన్ బియ్యం పిండి, రోజ్‌వాటర్‌ను కలపాలి. దీన్ని మెత్తటి పేస్ట్‌గా చేసి.. ముఖానికి మాస్క్‌లాగా అప్లయి చేసుకోవాలి. 10 నిమిషాల తర్వాత చల్లని నీటితో కడిగేసుకుంటే.. ముఖంపై ఉండే ట్యాన్ తొలగిపోతుంది.

# సిగకు అద్దాల సోకు!



పట్టులా మెరిసిపోయే కురులకు ధగధగలాడే అద్దాలు తోడైతే ఆ అందం ఎంత బాగుంటుందో అంటూ ఫ్యాషనిస్టులు చేసిన ఓ ఆలోచన అమ్మాయి సిగను తళుక్కుమనేలా చేసింది! అందుకే ఇప్పుడు మిర్రర్ బన్, మిర్రర్ హెయిర్ క్లిప్, హెయిర్ పిన్‌లు మార్కెట్లో సందడి చేస్తున్నాయి.

అసలైన అద్దాలు పొదిగిన ఈ యాక్సెసరీలు రకరకాల వెరైటీల్లో రూపొందుతున్నాయి. జడ విరబోసి, అందులోని కొన్ని వెంట్రుకలను కలుపుతూ పెట్టుకునే క్లిప్పులకు అద్దాలు, దారాలతో వర్క్ చేసి వస్తున్నవి ఒక మోడల్ అయితే, తల మీద కిరీటం పెట్టినట్టు వరుసగా అద్దాలను అమర్చి చేస్తున్నవి మరో మోడల్. పూర్తి కొప్పు వేసుకునేవారి కోసం బన్ మొత్తం పూసలు, పువ్వులతో మిర్రర్ వర్క్ చేసి వచ్చే వాటితో పాటు, క్యాజువల్‌గా ఫ్యాషన్‌గా సిగను చుట్టినా ఓ అద్దపు పిన్ను పెట్టుకునే వీలుండే వాటిదాకా ఇందులో ఎన్నెన్నో వెరైటీలు తయారవుతున్నాయి. అసలే తళుకుల్ని ఇష్టపడే అమ్మాయిలు చమక్కుమనే అద్దాల యాక్సెసరీలకు తమ ఫ్యాషన్ పెట్టెలో చోటివ్వకుండా ఉంటారా!

# కనుబొమలు చెప్పే రహస్యం



కనుబొమలు.. ముఖారవిందాన్ని మరో మెట్టు ఎక్కిస్తాయి. అందుకే, చాలామంది అందంగా కనిపించడానికి వీటిని పొందికగా తీర్చిదిద్దుకుంటారు. అయితే, కనుబొమలు.. ఆరోగ్య రహస్యాలనూ బయటపెడతాయని నిపుణులు అంటున్నారు. వెంట్రుకల మందం, పొడవుతోపాటు వాటి బలాన్ని బట్టి, మనిషి ఆరోగ్యాన్ని అంచనావేయొచ్చని అంటున్నారు. కనుబొమలు చాలా నెమ్మదిగా పెరుగుతాయి. కాబట్టి, అవి శరీరంలోని అంతర్లీన ఆరోగ్య సమస్యలను బహిర్గతం చేస్తాయట. వాటిలో మార్పులను జాగ్రత్తగా గమనిస్తే.. పలు సమస్యలను ముందే గుర్తించొచ్చని చెబుతున్నారు. కనుబొమలు సన్నబడటం, చిన్నగా, పెళుసుగా మారడం అనేది.. పోషకాహార లోపానికి సంకేతం కావచ్చు. ఆరోగ్యకరమైన వెంట్రుకల పెరుగుదలకు బయోటిన్, ఐరన్, జింక్, విటమిన్ డితోపాటు ప్రొటీన్ లాంటి పోషకాలు ఎంతో అవసరం. ఇవి లేకపోతే.. వెంట్రుకలు బలహీనపడటం, రాలిపోవడం లాంటి సమస్యలు ఎదురవుతాయి. పోషకాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం ద్వారా.. వెంట్రుకలు తిరిగి ఆరోగ్యంగా పెరగడానికి అవకాశం ఉంటుంది. హైపర్ థైరాయిడిజం ఉన్నట్లయితే.. వెంట్రుకలు పెళుసుగా మారి, ఇట్టే రాలిపోతుంటాయి. ఈ విషయాన్ని జర్నల్ ఆఫ్ క్లినికల్ అండ్ ట్రాన్స్‌లేషన్ ఎండోక్రినాలజీలో ప్రచురితమైనఅధ్యయనం వెల్లడించింది. నియంత్రించలేని హైపోథైరాయిడిజం.గణనీయమైన వెంట్రుకల నష్టానికి కారణమవుతుందని తేల్చింది. థైరాయిడ్‌కు సరైన చికిత్సతో హార్మోన్ల సమతుల్యతను పునరుద్ధరించొచ్చు. ఫలితంగా కనుబొమలు కూడా మళ్లీ పెరిగే అవకాశం ఉంటుంది. మెనోపాజ్ సమయంలో హార్మోన్లలో వచ్చే మార్పులు.. కనుబొమల సాంద్రత, పెరుగుదలపై ప్రభావం చూపుతాయి.అలసట, బరువులో హెచ్చుతగ్గులు, మానసిక స్థితిలో మార్పులు సంభవిస్తాయి. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే.. థైరాయిడ్, హార్మోన్ల సమస్యలపై వైద్యులను సంప్రదించడం మంచిది. కనుబొమలు రాలుతున్నాయంటే.. దీర్ఘకాలిక ఒత్తిడి, ఆటో ఇమ్యూన్ పరిస్థితులు కావొచ్చు. 'అలోపేసియా అరేటా' అనే ఆటో ఇమ్యూన్ డిసీజ్.. వెంట్రుకల కుదుళ్లపై దాడి చేస్తుంది. ఫలితంగా వెంట్రుకలు రాలిపోతాయి. ఆటో ఇమ్యూన్ వ్యాధులు, హార్మోన్ల సమస్యలు.. వెంట్రుకలు, కనుబొమలపై ప్రభావం చూపుతాయని జర్నల్ ఆఫ్ డెర్మటాలజీ అండ్ క్లినికల్ రీసెర్చ్‌లో ప్రచురితమైన ఓ సమీక్ష వెల్లడించింది.

# తాజాగా ట్రై చేయండి



చాలా మంది బిజీ లైఫ్‌లో పడిపోయి ఏ రోజుకారోజు తినాల్సిన తాజా కూరగాయలు, పండ్లను వారానికి సరిపడా తీసుకొచ్చి ఫ్రిజ్‌లో నిల్వచేసుకుంటున్నారు. ఎంత ఫ్రిజ్‌లో స్టోర్ చేసినా వారం తిరిగేసరికి అవి తాజాదనం కోల్పోతాయి.

కొంతమంది కూరగాయలు తీసుకురాగానే అన్నింటినీ ఒకే ట్రేలో వేసి స్టోర్ చేస్తుంటారు. దీనివల్ల త్వరగా పాడైపోవడం ఖాయం. అలాకాకుండా ఎక్కువ రోజులపాటు కూరగాయలు పాడవకుండా తాజాగా ఉండాలంటే కొన్ని టిప్స్‌ను పాటిస్తే సరిపోతుంది.

ఐస్ క్యూబ్ ట్రేడ్: నెలల తరబడి కూరగాయలు తాజాగా ఉండాలంటే.. వాటిని కట్ చేసి ఐస్ ట్రేలో వేసి నూనె, నీరు వేసి ఫ్రీజ్ చేయండి. వీటిని మీరు కావాలనుకున్నప్పుడు డైరెక్ట్ గా వంటల్లో వేయండి. అయితే, నూనె వేసి ఫ్రీజ్ చేసినప్పుడు వంటల్లో వేసే నూనె ఎకువగా వేయకుండా జాగ్రత్తపడాలి. దీంతో ఆయిల్ ఎకువగా ఉండకుండా రుచికరంగా ఉంటుంది. తడిపిపెట్టి: కొత్తిమీర, మెంతి, పుదీనా తదితర ఆకుకూరలు నిల్వ చేయడానికి వాటి చుట్టూ పేపర్ టవల్‌ని తడిపి చుట్టండి. లేదంటే ఓ అంగుళం నీరు ఉన్న గ్లాసులో నిలువుగా పెట్టి స్టోర్ చేయండి. దీనివల్ల అవి ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి. కంటెయినర్స్‌లో: ఎక్కువ మొత్తంలో తీసుకునే ఆహారపదార్థాలు చాలా రోజులు నిల్వచేయాలంటే గాలి చొరబడని కంటెయినర్స్‌లో భద్రపరచాలి. ఎయిర్ కంటెయినర్స్‌లో బెర్రీస్, టమాటలు, పుట్టగొడుగులు, మసాలా దినుసులను స్టోర్ చేస్తే.. అవి చాలాకాలం మన్నుతాయి.

# యాప్స్‌తో అపాయం



ఆధునిక సాంకేతిక అన్నిరంగాల్లోనూ ఆధిపత్యం చెలాయిస్తున్నది. ప్రతి పనిలోనూ ఏదో ఒకరకంగా ఉపయోగపడుతున్నది. ముఖ్యంగా.. పిల్లల చదువులు, వినోదంతోపాటు సామాజిక కార్యకలాపాల్లోనూ 'స్మార్ట్ గ్యాడ్జెట్స్'పైనే ఆధారపడాల్సి వస్తున్నది. అదే సమయంలో.. ఈ డిజిటల్ విప్లవం పిల్లల సైబర్ భద్రతను ప్రమాదంలో పడేస్తున్నది. తల్లిదండ్రుల నిర్లక్ష్యం, అవగాహనలేమి.. ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ప్రస్తుత డిజిటల్ యుగంలో పాఠశాలల్లోని పిల్లలకు అనేక యాప్‌లు అనివార్యమయ్యాయి. కానీ, అనుమతులను సరిగ్గా నిర్వహించకుంటే.. అవి వారి గోప్యతకు భంగం కలిగించడంతోపాటు భద్రతాపరమైన చిక్కులు తెస్తాయి. అనవసరమైన అనుమతులు డేటా ట్రాకింగ్, లక్ష్య ప్రకటనల కోసం ఉపయోగించే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో అవి వ్యక్తిగత సమాచార దుర్వినియోగానికీ దారితీయవచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది మనదేశంలో పిల్లలపై సైబర్ నేరాలలో 32 శాతం పెరుగుదల కనిపించిందని ఓ అధ్యయనంలో తేలింది కూడా. ఇందుకు ప్రధాన కారణం.. మొబైల్ యాప్‌లలో తెలియకుండా ఇచ్చే అనుమతులేనని అధ్యయనకారులు చెప్పుకొచ్చారు. కాబట్టి, పిల్లలు యాప్‌లను ఉపయోగించడానికి ముందు.. తల్లిదండ్రులు వాటిని సమీక్షించడం చాలా ముఖ్యమని అంటున్నారు.

ఇందుకు సంబంధించి పలు సూచనలు అందిస్తున్నారు. పిల్లల ట్యాబ్, ల్యాప్‌టాప్‌లోని యాప్స్‌లపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పకుండా ఉండాలి. ప్రముఖ డెవలపర్ సంస్థలు రూపొందించిన యాప్స్‌ను ఎంచుకోవాలి.లొకేషన్, కెమెరా, మైక్రోఫోన్, మీడియా ఫైల్స్ లాంటి సున్నితమైన విషయాల్లో యాక్సెస్ ఇవ్వకూడదు. అవసరమైతే తప్ప లొకేషన్ షేరింగ్‌ను ఎల్లప్పుడూ నిలిపివేయాలి. స్పష్టమైన కారణం లేకపోతే ఫొటోలు, వీడియో ఫైల్స్‌కు యాక్సెస్ ఇవ్వకపోవడమే మంచిది. ఆన్‌లైన్ భద్రతకు సంబంధించిన విషయాలపై పిల్లలతో చర్చించాలి. తద్వారా పిల్లలు అనుమానాస్పద సందేశాన్ని గుర్తించగలరు. వారి వ్యక్తిగత సమాచారాన్ని దాచిపెట్టడంపై అవగాహనతో ఉంటారు. వ్యక్తిగత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పంచుకోవడం వల్ల కలిగే ప్రమాదాల గురించి పిల్లలకు బోధించాలి. చివరగా.. ఇప్పుడున్న పరిస్థితుల్లో పిల్లల్ని డిజిటల్ సాధనాలకు దూరం చేయడం దాదాపు అసాధ్యమే! కాబట్టి, వారు సాంకేతికతను సురక్షితంగా, తెలివిగా ఉపయోగిస్తున్నారని నిర్ధారించుకోవడం ముఖ్యం. ఇందుకోసం కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉన్నది.

# నెల్లూరులో లేడీ డాన్ లు!

నెల్లూరు, : నెల్లూరు అంటే చాలా ప్రశాంతతకు మారు పేరు. చెన్నైకి సమీపంలో ఉండటంతో ఎక్కువ సంబంధాలు తమిళనాడుతోనే ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ బంగారు వ్యాపారానికి పుట్టినిల్లు అని చెప్పాలి. అయితే గత రెండేళ్ల నుంచి నెల్లూరు హత్యలకు నిలయంగా మారింది. పెన్నా నదీతీరంలో ఉన్న సింహపురి వరి ధాన్యానికి ఫేమస్. అలాగే సినిమాలకు కూడా ప్రసిద్ధి.

అలాంటి నెల్లూరు నేడు నేరాలకు నిలయంగా మారింది. నార్కొటిక్స్ హబ్‌గా నెల్లూరు మారింది. హత్యలు, దోపిడిలు, గంజాయి సంస్కృతి ఇటీవల కాలంలో మరింత పెరిగింది. అసలు రౌడీషీటర్లు, లేడీ డాన్లు ఇంత మంది నెల్లూరులో ఉన్నారా? అన్న నిజం సింహపురి వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు.కొందరు రౌడీషీటర్లు జైళ్ల నుంచే గంజాయి, రౌడీయిజం ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఒడిషా నుంచి షిప్‌లో ఏపీకి గంజాయి సరఫరా అవుతుంది. అక్కడి నుంచి బైక్స్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టులో రవాణా సాగుతుంది. మూడు అంచెల్లో గంజాయి సరఫరా జరుగుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక్క నెల్లూరులోనే 30 మంది సప్లయర్స్ ఉన్నారని పోలీసులు గుర్?ంచారు. 300 మంది డెలివరీ బాయ్స్ నెట్‌వర్క్ తో యధేచ్ఛగా నెల్లూరులో గంజాయి విక్రయాలు జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సీపీఎం నేత పెంచలయ్య హత్యకు 300 రూపాయల గంజాయి ప్యాకెట్ కారణం అని అంటున్నారు. పీకలు కోసే సంప్రదాయానికి కూడా నెల్లూరు రౌడీషీటర్లు తెగిస్తున్నారు.ఒంగోలులో టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య కేసులో కూడా నెల్లూరు క్రిమినల్స్ సుపారీ తీసుకుని మరీ చేశారని పోలీసులే చెబుతున్నారు. నెల్లూరు ఒకప్పుడు నిజాయితీ, నమ్మకం, ప్రేమకు పేరుపొందిన నగరం.

అయితే ఈరోజు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డ్రగ్స్, రౌడీయిజం నెల్లూరులో జైలు నుంచే నడుస్తున్నాయి. నెల్లూరు నేరగాళ్లకు నిలయంగా మారింది. లేడీ డాన్ లు అరుణ, అరవ కామాక్షిలు నెల్లూరు నగరాన్ని శాసిస్తున్నారు. అసలు నెల్లూరులో ఇంత మంది రౌడీషీటర్లున్నా లేడీ డాన్ లు మాత్రం చక్రం తిప్పుతున్నారంటే నెల్లూరు వాసులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మాఫియా సామ్రాజ్యానికి రాణులుగా చెలామణి అవుతున్నారు. పోలీసులు ఇప్పటికైనా నెల్లూరు మాఫియా గ్యాంగ్ పై ఉక్కుపాదం మోపి మునుపటి నెల్లూరులా మార్చాలని నగర వాసులు కోరుకుంటున్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్..

# తాడేపల్లి వాసుల దశాబ్దాల కల సాకారం

**తాడేపల్లి రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్**

**రూ.294 కోట్లతో కృష్ణా నదికి వరద రక్షణ గోడ నిర్మాణం**

**50 వేల మందికి వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం**

**పైల్-రాఫ్ట్ టెక్నాలజీతో భూకంపాలను తట్టుకునేలా నిర్మాణం**

**నులకపేటలో రూ.65 లక్షలతో కమ్యూనిటీ హాల్ ప్రారంభం**




ఏపీ మంత్రి నారా లోకేశ్ తన నియోజకవర్గం మంగళగిరి ప్రజలకు ఇచ్చిన మరో కీలక హామీని నెరవేర్చారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తాడేపల్లి రిటైనింగ్ వాల్ (వరద రక్షణ గోడ) నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.294.20 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలోనే పరిపాలన అనుమతులు, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులకు శ్రీకారం చుట్టడం గమనార్హం.ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణా నది కుడి వైపున 0.9 కి.మీ నుంచి 2.610 కి.మీ వరకు ఈ గోడను నిర్మించనున్నారు. సాధారణ గోడలా కాకుండా భూమిలోకి 26 నుంచి 38 మీటర్ల లోతు వరకు 1,920 పైల్స్ వేసి, ఆధునిక పైల్-రాఫ్ట్ సాంకేతికతతో దీన్ని నిర్మిస్తారు. భవిష్యత్తులో 15 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చినా, భూకంపాలు సంభవించినా తట్టుకునేలా దీన్ని డిజైన్ చేశారు. ఈ రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయితే తాడేపల్లి పరిధిలోని సుందరయ్య నగర్, మహానాడు కాలనీ సహా పలు లోతట్టు ప్రాంతాల్లోని సుమారు 50 వేల మంది ప్రజల వరద కష్టాలు శాశ్వతంగా తీరనున్నాయి. అంతేకాకుండా అమరావతిలోని కొన్ని ప్రాంతాలకు, జాతీయ రహదారి 65కు కూడా ఈ గోడ రక్షణగా నిలుస్తుందిఈ కార్యక్రమాలతో పాటు మంత్రి లోకేశ్ నులకపేటలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కూడా ప్రారంభించారు. శ్రీరంగం ఫౌండేషన్ సహకారంతో రూ.65 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఈ భవనాన్ని నిర్మించారు. నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన తెలిపారు.

## ఢిల్లీ లిక్కర్ స్కామ్...

# కవిత, కేజ్రీవాల్ కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

**సీబీఐ కేసులో నిందితులను విముక్తి చేసిన రౌస్ అవెన్యూ కోర్టు**

**కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన సీబీఐ**

**రివిజన్ పిటిషన్ పై వివరణ ఇవ్వాలంటూ నిందితులకు హైకోర్టు నోటీసులు**





దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ మళ్లీ కీలక మలుపు తిరిగింది. ఫిబ్రవరి 27న రౌస్ అవెన్యూ కోర్టు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, కల్వకుంట్ల కవిత సహా మొత్తం 23 మందిని ఈ కేసు నుండి విముక్తి చేస్తూ తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. ఈ క్రమంలో సీబీఐ పిటిషన్ పై ఈరోజు హైకోర్టు విచరాణ జరిపింది. ఈ విచారణలో భాగంగా ధర్మాసనం కేజ్రీవాల్, కవిత, సిసోడియాతో పాటు మిగిలిన నిందితులందరికీ నోటీసులు జారీ చేసింది. సీబీఐ దాఖలు చేసిన ఈ రివిజన్ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. విచారణ సందర్భంగా సీబీఐ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ... విచారణాధికారిపై కోర్టు చేసిన వ్యాఖ్యలు దర్యాప్తు సంస్థల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన హైకోర్టు, దర్యాప్తు సంస్థ, విచారణాధికారిపై ట్రయల్ కోర్టు చేసిన ప్రతికూల వ్యాఖ్యలపై స్టే విధిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది.అంతేకాకుండా, సీబీఐ కేసులో నిందితులు విడుదలయ్యారు కాబట్టి ఈడీ దాఖలు చేసిన మనీ లాండరింగ్ కేసు విచారణను కూడా నిలిపివేయాలని నిందితుల తరపు న్యాయవాదులు కోరగా.. హైకోర్టు భిన్నంగా స్పందించింది. సీబీఐ రివిజన్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే వరకు మనీ లాండరింగ్ కేసు విచారణను వాయిదా వేయాలని ట్రయల్ కోర్టుకు సూచించింది. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

# అమెరికా బూటకత్వం




అమెరికా విదేశాంగ విధాన బూటకత్వాన్ని ప్రపంచం ప్రత్యక్షంగా చూసింది. ఎప్పటికంటే ఇప్పుడది మరింత ఎక్కువగా బయటపడిపోయింది. పెట్టుబడిదారీ విధానానికి వంత పాడే అనేక మంది సమకాలీన వ్యాఖ్యాతలు లెనిన్ సిద్ధాంతాలకు కాలం చెల్లిందని ప్రకటించడానికి ఆదుర్దాపడి పోతుంటారు. కానీ యుద్ధం, పెట్టుబడిదారీ విధానం అనేవి అవిభాజ్య కవలల వంటివని ఆయన నొక్కి చెప్పిన సిద్ధాంతం ఎంతగానో సజీవంగా శక్తివంతంగా వినిపిస్తుంది. యూదు జాత్యంహంకారంతో కూడిన అఖండ మహా ఇజ్రాయిల్ పథకానికి ఇరాన్ నుంచి వస్తున్న ప్రతిఘటనను నిర్వీర్యం చేయాలంటూ అధ్యక్షుడు ట్రంప్‌ను ఇజ్రాయిల్ పురికొల్పింది. అదే సమయంలో ఈ ప్రాంతంలో తమ తిరుగులేని ఆధిపత్యాన్ని నెలకొల్పుకోడానికి, రష్యా చైనా ప్రభావం పెరక్కుండా అడ్డుకోవడానికిగాను ఇరాన్ పాలక వ్యవస్థను మార్చాలని ట్రంప్ పాలన వ్యవస్థ కూడా తలపోసింది.ట్రంప్ ఏదో శాంతికాముక అధ్యక్షుడనేది ఒక బూటకం మాత్రమే. ఇరాన్ అణు కార్యక్రమం గురించి పదేపదే మాట్లాడటం మొదటి నుంచీ మోసపూరితమే. ఇజ్రాయిల్‌కు రహస్య అణ్వస్త్ర సామర్థ్యం వుందనేది బహిరంగ రహస్యం అయినా ఎవరూ దాని గురించి పెదవి మెదపరు. మరోవైపున ఇరాన్ తాము అణ్వాయుధం చేయడం లేదని తేటతెల్లంగా ప్రకటించింది. పర్యవేక్షకులకు ఆ ప్రదేశాల సందర్శనను అనుమతించింది. అయితే అక్కడ పారదర్శకత ప్రమాణాలపై అంతర్జాతీయ అణు సంస్థ (ఐ.ఎ.ఇ.ఎ) చొరబాటుదారీ రాజకీయ దురుద్దేశాలతో ప్రకటన చేసిన తర్వాతనే ప్రతిష్టంభన ఉత్పన్నమైంది.అంతేగాక 2025లో ఇరాన్ అణు ప్రదేశాలపై భారీ ఎత్తున బాంబు దాడులు జరిగాయి. వాటిని ధ్వంసం చేశామనీ ఇక సమీప భవిష్యత్తులో ఉత్పత్తి చేయగల స్థితిలో లేవని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ కూడా ఒమన్ మధ్యవర్తిత్వంలో దౌత్యపరమైన సంప్రదింపులు మొదలుపెట్టింది. అయితే అది వారు గల్ఫ్‌లో సైనిక బలం పోగేసుకోవడానికీ, అమెరికా వైమానిక బాంబు దాడి సంపత్తిని ఇరాన్ పైకి మోహరించడానికి ఒక వంచనాత్మక ఎత్తుగడ మాత్రమే. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ రెండూ కలసికట్టుగా దాడి చేయడాన్ని బట్టి చూస్తే ఇది ఖచ్చితంగా పథకం ప్రకారమే జరిగిందని తెలిసిపోతుంది. ఇరాన్ తన ఆయుధ నిల్వలను గణనీయంగా తగ్గించుకుని దౌత్య పరమైన పరిష్కారం కోసం చేసిన ప్రయత్నాలను అందుకే తిరస్కరించారు. ఇప్పుడు ఎప్పుడూ కూడా అణుబాంబు చేయబోమని చెప్పినట్టు ఒమన్ విదేశాంగ మంత్రి ద్వారా బహిరంగంగానే ప్రకటించారు కూడా. అయినా వారు తిరస్కరించారు.ఈ మొత్తం పరిణామ క్రమం మోడీ ఇండియాకు తిరిగివచ్చిన 48 గంటలలోనే జరిగింది. మొత్తం ఘటనల క్రమం బట్టి చూస్తే ఈ సైనిక దుస్సాహసంలో ఇండియా దాదాపు భాగంగా కనిపిస్తుంది. అమెరికా ఏ విధమైన లెక్కలు వేసుకున్నా అవన్నీ తప్పిపోయాయి. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలన్నిటిపై ఇరాన్ ప్రతీకార దాడులు ప్రారంభించింది. టెల్ అవీవ్‌తో సహా ఇజ్రాయిల్ నగరాలనేక వాటిపై ఇరాన్ మిసైల్ దాడులు మరింత తీవ్రంగా సాగుతున్నాయి.ఇరాన్ ప్రతీకార చర్యలను పిరికితనంగా అమెరికా, దాని మిత్రులు అభివర్ణించడం విడ్డూరంగా కనిపిస్తుంది. అమెరికా ఇజ్రాయిల్ ఉమ్మడిగా జరిపిన దురాక్రమణ కావాలని చేసింది. వేరువేరుగా కనిపిస్తూ కలిసి చేసిన దురాక్రమణలో అలీ ఖమేనీతో సహా తమ నాయకత్వంలో ప్రముఖమైన వారిని హత్యగావించిన తర్వాత కేవలం తన మనుగడ కోసం అనివార్యంగా చేస్తున్నది ఇరాన్ ప్రతిఘటన.ఇరాన్‌కు గల వికేంద్రీకృతమైన, బహుళ దొంతరలతో కూడిన ప్రత్యామ్నాయ నాయకత్వ వ్యవస్థలను, సైనిక సంఘర్షణ ఏర్పాట్లు బాగా తెలిసినవే. అది వాటిని స్పష్టంగా ప్రదర్శించడమేగాక ఇప్పుడు క్రియాశీలం చేసింది. ఇరాన్ హార్మోజ్ జలసంధిని మూసివేయడంతో భారత దేశ విదేశాంగ విధానం మాత్రం స్వీయ పరాజయ కారకంగా మారింది. భారతీయ ఇంధన సరఫరాలలో అత్యధిక భాగం దాని ద్వారానే చేరాల్సి వుండగా ఈ నిర్ణయం చమురు ధరలు ఉన్నఫళాన పెరిగిపోవడానికి కారణమైంది.

## వెనెజువెలా నుంచి అమెరికాకు

## రూ.923 కోట్ల విలువైన బంగారం



**వెనెజువెలాలో 500 బిలియన్ డాలర్ల బంగారు వనరులు ఉన్నాయన్న అమెరికా మంత్రి**

**వెనెజువెలా మైనింగ్ కంపెనీతో అమెరికా ఒప్పందాలు**

**మినర్వెన్‌తో కలిపి తవ్వకాలు చేపట్టిన అమెరికా**

వెనెజువెలా నుంచి అమెరికాకు 100 మిలియన్ డాలర్ల బంగారం వచ్చింది. ఇది మన కరెన్సీలో సుమారు రూ.923 కోట్లు. వెనెజువెలా వద్ద 500 బిలియన్ డాలర్ల బంగారు వనరులు ఉన్నాయని అమెరికా హోం మంత్రి డగ్ బర్గమ్ వెల్లడించారు. శుక్రవారం ఈ బంగారం వచ్చిందని, ఆ దేశం వద్ద పెద్ద ఎత్తున నిల్వలు ఉన్నాయని తెలిపారు.వెనెజువెలా ప్రభుత్వ ఆధ్వర్యంలోని బంగారం మైనింగ్ కంపెనీ మినర్వెన్‌తో లావాదేవీలకు అనుమతిస్తూ అమెరికా ఇప్పటికే లైసెన్స్ జారీ చేసింది. ఆ సంస్థతో కలిసి తవ్వకాలు చేపట్టింది. ఇటీవల వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్‌తో బర్గమ్ భేటీ అయ్యారు. అలాగే అమెరికా మైనింగ్, మినరల్ కంపెనీలతోనూ చర్చలు జరిపారు. తాజా లైసెన్స్ కింద ఉత్తరకొరియా, రష్యా, ఇరాన్, క్యూబాకు చెందిన వ్యక్తులు, సంస్థలతో మినర్వెన్ ఒప్పందాలు చేసుకోవడంపై నిషేధం ఉంది.ఖనిజ సంపన్న ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ఉన్న సంస్థలకు భద్రత కల్పిస్తామని డెల్సీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని బర్గమ్ వెల్లడించారు.

## స్వల్పంగా తగ్గిన భారత్ ఆయుధ దిగుమతులు..

# పెరిగిన పాకిస్థాన్ కొనుగోళ్లు

**ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా భారత్**

**గతంతో పోలిస్తే 4.0శాతం తగ్గిన భారత్ ఆయుధ దిగుమతులు**

**భారత్‌కు రష్యా ఆయుధ సరఫరా వాటా 40 శాతానికి పడిపోయిన వైనం**

**భారీగా పెరిగిన పాకిస్థాన్ ఆయుధ దిగుమతులు.. 80 శాతం చైనా నుంచే**

**ప్రపంచంలో ఆయుధాలను అత్యధికంగా ఎగుమతి చేస్తున్న దేశంగా అమెరికా**



ప్రపంచవ్యాప్తంగా ఆయుధాలను అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో నిలిచింది. 2021-2025 మధ్య కాలంలో ప్రపంచ ఆయుధ దిగుమతుల్లో భారత్ వాటా 8.3 శాతంగా ఉందని స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఐపీఆర్ఐ) తన తాజా నివేదికలో వెల్లడించింది. రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్ 9.7 శాతం వాటాతో ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉంది.సిప్రి విడుదల చేసిన 'ట్రెండ్స్ ఇన్ ఇంటర్నేషనల్ ఆర్మ్స్ ట్రాన్స్‌ఫర్స్-2025' నివేదిక ప్రకారం.. గత ఐదేళ్లతో (2016-20) పోలిస్తే 2021-25 మధ్యకాలంలో భారత్ ఆయుధ దిగుమతులు 4.0 శాతం తగ్గాయి. దేశీయంగా ఆయుధాలను డిజైన్ చేసి, తయారు చేసే సామర్థ్యం పెరగడమే ఇందుకు ఒక కారణంగా నివేదిక పేర్కొంది. అయితే, దేశీయ ఉత్పత్తిలో తరచూ జరుగుతున్న జాప్యం వల్ల విదేశీ సరఫరాదారులపై ఆధారపడటం కొనసాగుతోందని కూడా తెలిపింది. ఫ్రాన్స్ నుంచి 140 యుద్ధ విమానాలు, జర్మనీ నుంచి 6 జలాంతర్గాముల కొనుగోలుకు ఇటీవల కుదుర్చుకున్న ఒప్పందాలు ఇందుకు నిదర్శనమని వివరించింది.గత దశాబ్ద కాలంగా భారత్ తన ఆయుధాల కొనుగోళ్ల కోసం రష్యాపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, పశ్చిమ దేశాల వైపు మొగ్గు చూపుతోంది. 2021-25 మధ్య కాలంలో భారత్‌కు రష్యా అతిపెద్ద ఆయుధ సరఫరాదారుగా ఉన్నప్పటికీ, దాని వాటా 40 శాతానికి పడిపోయింది. గతంలో ఇది 70 శాతం వరకు ఉండేది. ఇదే సమయంలో ఫ్రాన్స్ (29 శాతం), ఇజ్రాయెల్ (15 శాతం) నుంచి భారత్ దిగుమతులు గణనీయంగా పెరిగాయి.చైనా, పాకిస్థాన్‌లతో ఉన్న ఉద్రిక్తతల కారణంగానే భారత్ తన ఆయుధ దిగుమతులను కొనసాగిస్తోందని సిప్రి నివేదిక విశ్లేషించింది. మరోవైపు, పాకిస్థాన్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా (4.2 శాతం వాటా) ఉంది. గత ఐదేళ్లతో పోలిస్తే పాకిస్థాన్ దిగుమతులు 66 శాతం పెరిగాయి. పాకిస్థాన్‌కు చైనా 80 శాతం ఆయుధాలను సరఫరా చేస్తోంది.ప్రపంచవ్యాప్తంగా అమెరికా 42 శాతం వాటాతో అతిపెద్ద ఆయుధ ఎగుమతిదారుగా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఫ్రాన్స్ (9.8 శాతం) రెండో స్థానంలో నిలవగా, రష్యా మూడో స్థానానికి పరిమితమైంది.




# కాలేజ్ స్టూడెంట్స్‌తో శ్రీలీల రచ్చ..



పెళ్లి సందడి' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన శ్రీలీల చాలా తక్కువ సమయంలోనే యూత్‌లో భారీ క్రేజ్ సంపాదించుకుంది. అందం, ఎనర్జిటిక్ డ్యాన్స్‌లు, చురుకైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె వరుస అవకాశాలను అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. పెద్ద హీరోలతో పాటు యువ హీరోల సరసన కూడా నటిస్తూ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల శ్రీలీల ఓ విద్యాసంస్థ కార్యక్రమంలో పాల్గొని మరోసారి వార్తల్లో నిలిచింది.

పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైంది. విద్యార్థులతో కలిసి స్టేజ్‌పై డ్యాన్స్ చేస్తూ, వారితో సరదాగా ముచ్చటిస్తూ అందరినీ ఉత్సాహపరిచింది. తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఈ ప్రాంతానికి ఎప్పుడో వచ్చానని, మళ్లీ రావడం ఆనందంగా ఉందని తెలిపింది. చదువుతో పాటు లక్ష్యాలను కూడా స్పష్టంగా పెట్టుకోవాలని విద్యార్థులకు సూచించింది. స్టేజ్‌పై మాట్లాడుతున్న సమయంలో విద్యార్థులు డ్యాన్స్ చేయమని కోరగా, శ్రీలీల సరదాగా స్పందించి అందరినీ నవ్వుల్లో ముంచెత్తింది. ఆమె చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ నెటిజన్లలో చర్చనీయాంశమయ్యాయి. అభిమానులు ఆమె హ్యూమర్ సెన్స్‌ను మెచ్చుకుంటున్నారు. అయితే తే డ్యాన్స్ చేయమని కింద ఉన్న అబ్బాయిలు గట్టిగా అరవడంతో శ్రీలీల స్పందిస్తూ.. "నిజంగా పెళ్ళాన్ని అడిగినట్లు అడిగారు.. డ్యాన్స్ చేద్దాం.. కమాన్" అని అనడంతో పిల్లలు డ్యాన్స్ వేసి చప్పట్లు కొట్టారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు ఫన్నీ కామెంట్స్ చేస్తున్నారు.

కెరీర్ పరంగా చూస్తే శ్రీలీల కన్నడ చిత్రం 'కిస్' ద్వారా సినీ రంగ ప్రవేశం చేసి, తెలుగు ప్రేక్షకులకు 'పెళ్లి సందడి'తో పరిచయమైంది. 'ధమాకా' విజయంతో ఆమెకు భారీ గుర్తింపు వచ్చింది.


అనంతరం పలువురు స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన విజయాన్ని సాధించకపోయినా, ఆమెకు వచ్చిన పాత్రలు మంచి పేరును తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఒక పెద్ద ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా ఎంపిక కావడం ఆమె కెరీర్‌కు కొత్త ఊపును ఇచ్చింది. తెలుగులో 'ఉస్తాద్ భగత్ సింగ్', హిందీలో కార్తీక్ ఆర్యన్‌తో ఒక చిత్రం చేస్తూ బిజీగా కొనసాగుతోంది.

# హీరో శర్వానంద్ ఆసక్తికర కామెంట్స్



'ఫ్యామిలీ హీరో'గా గుర్తింపు తెచ్చుకున్న శర్వానంద్ ఈ ఏడాది సంక్రాంతికి 'నారీ నారీ నడుమ మురారి'తో ప్రేక్షకులను అలరించి హిట్ ఖాతాలో వేసుకున్నారు. ఈ విజయంతో ఉత్సాహంగా ఉన్న ఆయన, పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. రాబోయే 'బైకర్' సినిమా కోసం 18ఏళ్ల యువకుడిగాకనిపించాల్సి రావడంతో రెండేళ్లలో 22 కిలోల బరువు తగ్గానని తెలిపారు. కేబీఆర్ పార్క్‌లో రన్నింగ్, జిమ్, కఠిన ఆహార నియమాలతో ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. తనకు బాగా కలిసి వస్తోందని, 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'శతమానం భవతి', 'నారీ నారీ నడుమ మురారి'తో పొంగల్ హ్యాట్రిక్ సాధించిన ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే సంక్రాంతికి శ్రీనువైట్ల దర్శకత్వంలో మరో సినిమాతో రానున్నట్లు వెల్లడించారు. 'నారీ నారీ నడుమ మురారి' టైటిల్‌ను బాలకృష్ణ అనుమతితోనే వాడుకున్నామని, ఆయన ఆశీర్వాదం తనకు ఎంతో ప్రత్యేకమని అన్నారు. చిరంజీవే తనకు ప్రేరణ అని, 'స్వయంకృషి' సినిమా తనను నటన వైపు నడిపించిందని గుర్తు చేసుకున్నారు. 'పడిపడి లేచె మనసు' ఫలితం తనను లోతుగా ఆలోచింపజేసిందని, ఆ క్రమంలోనే తొందరపడి సినిమాలకు ఒప్పుకోకూడదని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఇప్పుడు ఏ ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలన్నా జాగ్రత్తగా ఆలోచిస్తున్నానన్నారు. టైమ్ ట్రావెల్ చేసే అవకాశం వస్తే నేరుగా ఇంటర్ కాలేజీ రోజుల్లోకే వెళ్లిపోతానని, అవే నిజమైన హ్యాపీ డేస్ అని వ్యాఖ్యానించారుయ. నిన్నటి గురించి బాధలు, రేపటి గురించి ఆందోళనలు ఏమీ ఉండేవి కావని అన్నారు. అప్పట్లో కాలేజీకి డుమ్మా కొట్టి సినిమాలకు వెళ్లడం, అక్కడి నుంచి దాబాకు వెళ్లి తిండి తినడం, అవన్నీ గోల్డెన్ మెమరీస్ అని చెప్పుకొచ్చారు.

# వరుణ్ తేజ్ కెరీర్‌కు కీలక మలుపు .. అట్లీ కాంబో వార్తలతో పెరిగిన హైప్




మెగా బ్రదర్ నాగబాబు వారసుడిగా 'ముకుంద' సినిమాతో టాలీవుడ్‌లో హీరోగా ఎంట్రీ ఇచ్చిన మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు సంపాదించుకున్నాడు. ఆ తరువాత కూడా మాస్ మూసలో ఇరుక్కుపోకుండా విభిన్న కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను నిర్మించుకున్నాడు. కమర్షియల్ సినిమాలతో పాటు ప్రయోగాత్మక కథలను స్వీకరించడం ద్వారా యువ హీరోల్లో తనదైన స్థానాన్ని ఏర్పరుచుకున్నాడు. అయితే గత కొంతకాలంగా వరుస పరాజయాలు ఎదురవ్వడంతో వరుణ్ తేజ్ కెరీర్‌పై ఒత్తిడి పెరిగిందనే అభిప్రాయాలు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. మార్కెట్, ఇమేజ్ పరంగా కూడా కొంత ప్రభావం పడిందనే టాక్ నడుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లోనే మళ్లీ సక్సెస్ ట్రాక్‌లోకి రావాలనే సంకల్పంతో వరుణ్ తేజ్ తన తదుపరి ప్రాజెక్ట్‌ల ఎంపికలో మరింత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. కెరీర్‌ను మలుపుతిప్పే బలమైన హిట్ కోసం ఆచితూచి కథలను పరిశీలిస్తున్నాడని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా వినిపిస్తున్న ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీతో వరుణ్ తేజ్ సినిమా చేయబోతున్నారనే ప్రచారం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. 'జవాన్' వంటి భారీ బ్లాక్‌బస్టర్‌తో బాలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన అట్లీ ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో ఓ భారీ ప్రాజెక్ట్‌పై పనిచేస్తున్నాడు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో తెరకెక్కుతోందనే టాక్ ఇప్పటికే ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత వరుణ్ తేజ్‌తో సినిమా చేయాలని అట్లీ ఆలోచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వరుణ్ కోసం ఇప్పటికే ఓ పవర్‌ఫుల్ కమర్షియల్ యాక్షన్ కథ సిద్ధం చేశారనే ప్రచారం నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఈ కాంబినేషన్ నిజమైతే వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్ అవుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అధికారిక ప్రకటన రాకపోయినా ఈ వార్త వరుణ్ మార్కెట్‌పై మళ్లీ పాజిటివ్ బజ్ తీసుకొచ్చిందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇదిలా ఉండగా వరుణ్ తేజ్ ప్రస్తుతం మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న 'కొరియన్ కనకరాజు' చిత్రంలో నటిస్తున్నాడు. హారర్ కామెడీ జానర్‌లో, కొరియన్ టచ్‌తో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే టైటిల్ గ్లింప్స్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది.

# బాక్సాఫీస్‌పై 'బోర్డర్ 2' దూకుడు..




బాలీవుడ్‌లో క్లాసిక్ వార్ డ్రామాగా నిలిచిన 'బోర్డర్' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన 'బోర్డర్ 2' బాక్సాఫీస్ వద్ద జైత్రయాత్రను కొనసాగిస్తోంది. సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో, అనురాగ్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పీరియడ్ వార్ డ్రామా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. దేశభక్తి భావోద్వేగాలు, యుద్ధ సన్నివేశాల భీకరత, సాంకేతిక నైపుణ్యం ఈ చిత్రాన్ని భారీ హిట్ దిశగా నడిపిస్తున్నాయి. విడుదలైన 10వ రోజుకే ఈ సినిమా కీలక మైలురాయిని అందుకుంది. ముఖ్యంగా రెండో ఆదివారం రోజున బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను నమోదు చేయడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. రెండో ఆదివారం ఒక్కరోజే సుమారు రూ. 24.22 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించడంతో ఈ చిత్రం భారత్‌లో ప్రతిష్టాత్మకమైన రూ. 300 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. తాజా గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా ఈ సినిమా మొత్తం నెట్ వసూళు రూ. 301.89 కోట్లకు చేరుకున్నట్లు సమాచారం. అయితే అసలైన పరీక్ష ఇప్పుడే ప్రారంభమవుతుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. వారాంతపు హైప్ తర్వాత సోమవారం నుంచి కలెక్షన్లు తగ్గే అవకాశం ఉండటంతో, దీర్ఘకాలంలో సినిమా ఎంత స్థాయిలో రాణిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. అయినప్పటికీ మొదటి రెండు వారాల్లోనే ఈ స్థాయి వసూళ్లు సాధించడం 'బోర్డర్ 2'కు ఉన్న క్రేజ్‌ను స్పష్టంగా చూపిస్తోంది. ఇదిలా ఉంటే, ఈ చిత్ర విజయోత్సాహంలోనే మేకర్స్ మరో కీలక ప్రకటన చేశారు. 'బోర్డర్ 3' ను కూడా అధికారికంగా ప్రకటిస్తూ అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. టీ-సిరీస్ ఫిల్మ్స్ మరియు జెపి ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహన్ శెట్టి, మోనా సింగ్, సోనమ్ బజ్వా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో 'బోర్డర్' ఫ్రాంచైజీపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి పెరిగింది.మొత్తంగా చూస్తే, దేశభక్తి కథాంశంతో వచ్చిన 'బోర్డర్ 2' బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతూ, వరుస రికార్డులు సృష్టిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సినిమా ఇంకా ఎలాంటి మైలురాళ్లు చేరుకుంటుందో అనేది సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.




# రవితేజ మూవీ నుంచి 'బెల్లా బెల్లా'



మాస్ మహరాజ రవితేజ నటించిన లేటెస్ట్ చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. సంక్రాంతి స్పెషల్‌గా విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదు అనిపించింది. డింపుల్ హయాతి, అషిక రంగనాథ్‌లు ఈ సినిమాలో హీరోయిన్లుగా నటించారు. అయితే ఈ సినిమా నుంచి 'బెల్లా బెల్లా' అంటూ సాగే వీడియో సాంగ్‌ని చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ పాటకి థియేటర్లలో మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు యూట్యూబ్‌లో కూడా పాట అభిమానులను అలరిస్తోంది. మరిన్ని కనుగొనండి సినిమా టిక్కెట్లు ఆన్‌లైన్ వీడియో వార్తలు జిల్లా వార్తలు ఈ పాటకి సురేశ్ గంగుల లిరిక్స్ అందించగా.. నకాశ్ అజీజ్, రోహిణి అలపించారు. ఇక ఈ సినిమాకు భీమ్స్ సంగీతం అందించాడు. కాగా, కిషోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215